మహబూబ్‌నగర్
నాగర్‌కర్నూల్
జోగులాంబగద్వాల్
నారాయణపేట
వనపర్తి

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
17వ వసంతంలోకి

గురువారం 8 ఫిబ్రవరి 2024 పేజీలు 8

# అంగన్వాడీ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు సక్రమంగా ఉండేలా చూడాలి

## - జిల్లా కలెక్టర్



**వనపర్తి ప్రతినిధి, మేజర్ న్యూస్ :** జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీరు, టాయ్ లెట్స్, ఆట వస్తువులు వంటి సౌకర్యాలు సక్రమంగా ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా సంక్షేమ శాఖ, సీడీపీఓ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలకు సంబంధించి టీచర్లు, సూపర్వైజర్లతో

మిగతా 2లో

# అంతటా అసంతృప్తి

## - బిఆర్‌యస్ సమీక్షల్లో బయటపడుతున్న మనోగతం
## - మాజీల తీరుపై కార్యకర్తల ఫైర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, మేజర్‌న్యూస్:** అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత తేరుకున్న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని బిఆర్‌యస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల వేళ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తుంది. ఈ జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులు ఖరారు కానప్పటికి ఎవరికి వారుగా నియోజకవర్గాల స్థాయి సమీక్ష సమావేశాలు జరుపుతున్నారు. మహబూబ్‌నగర్, గద్వాల, నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల్లో మాజీ ప్రజా ప్రతినిధుల తీరుపై కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మాజీ మంత్రులు ఎమ్మెల్యేల నిర్వాకం వల్లే ఎన్నికల్లో ఓటమి పాలైయ్యారు అని తమ మనోభావాలను వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను ఇదే పార్టీకి చెందిన రాష్ట్రస్థాయి మాజీ కార్పోరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్ తీవ్ర ఆరోపణలు చేశారు. మంత్రి ఒంటెద్దు పోకడలు కార్యకర్తలను పట్టించుకోకపోవడం, వివిధ హోదాల్లో ఉన్న ప్రజా ప్రతినిధులను కూడా విస్మరించి కార్యక్రమాల్లో పాల్గొనడం ప్రజల్లో వ్యతిరేకత గుర్తించకుండా గుడ్డిగా వ్యవహరించడం వల్లే వ్యక్తిగతంగా శ్రీనివాస్‌గౌడ్ కారణంగానే మహబూబ్‌నగర్‌లో బిఆర్‌యస్ ఓడిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా నారాయణపేటలో జరిగిన సమీక్ష సమావేశానికి ఆ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే టిఆర్‌యస్ పార్టీ జిల్లా అధ్యక్షులు యస్. రాజేందర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ నాయకులు మాట్లాడుతూ పేట నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పనిచేసిన యస్.ఆర్.రెడ్డి కేవలం డబ్బు ఉన్నవారికే ప్రధాన్యత ఇచ్చి కార్యకర్తలను అస్సలు పట్టించుకోలేదు అని, ఏ ఒక్క కార్యకర్తకైనా న్యాయం చేశావా? టి తాగమంటే కూడా అంత నామూషి ఎందుకు, దొరల పాలన సాగించినవు కాబట్టి నీవే ఓటమికి ప్రధాన కారణం అంటూ విమర్శించారు. మక్తల్ నియోజకవర్గంలో కూడా అక్కడి స్థానిక మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకతతో పాటు నాయకులు, కార్యకర్తలను పట్టించుకోని కారణంగా ఓటమి పాలయ్యారు అని పలవురు నాయకులు విమర్శించారు. కేవలం కొంతమందికే పెత్తనం ఇచ్చి టిఆర్‌యస్ నిజమైన కార్యకర్తల మనోభావం దెబ్బతీసేలా పనితీరు ఉండడం వల్ల చిట్టెం ఓటమి స్వయం కృతాపరాధమే అని వ్యాఖ్యానించారు. ఇటీవల గద్వాల నియోజకవర్గంలో

మిగతా 2లో

# హస్తంతో నేస్తంపై ..

- ఈనెలఖరు ముహూర్త మంటూ లీకులు
- కార్యకర్తల్లో ఆందోళన

# కొనసాగుతన్న సస్పెన్స్



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మేజర్‌న్యూస్ :** ఓడిన వారు బజారున గెలిచినవారు ఇంట్లో కూర్చుని ఏడ్చారన్న సామెత నాగర్‌కర్నూల్ నియోజకవర్గ రాజకీయాల్లో కాంగ్రెస్ బిఆర్‌ఎస్ కార్యకర్తలకు సరిగ్గా అన్వయం అవుతుంది. నాగర్‌కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గంలో సుదీర్ఘకాలం తర్వాత అధికార పీఠం ఎక్కిన కాంగ్రెస్ కార్యకర్తల్లో ఉరకలెత్తిన ఉత్సాహం, ఓటమి తర్వాత బిఆర్‌ఎస్ కార్యకర్తల్లో చెలరేగిన ఆందోళనలు పూర్తి స్థాయిలో ఆస్వాదించలేని విచిత్ర పరిస్థితి ఇక్కడ నెలకొంది. రెండుపర్యాయాలు నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేగా గెలుపొంది ఇటీవలి ఎన్నికల్లో ఓటమి పాలయిన బిఆర్‌ఎస్ నేత మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్ధన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారన్న వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ బిఆర్‌ఎస్ కార్యకర్తల్లో ఆందోళన వ్యక్త మవుతున్నది. మర్రికాంగ్రెస్ తీర్థం పుచ్చుకునే విషయంలో జరుగుతున్న దాగుడు మూతలు ఇరుపార్టీల కార్యకర్తలను సందిగ్ధంలో పడేసాయి.

● హస్తంతో నేస్తం విషయంలో వస్తున్న వార్తలను అవునంటూ స్పష్టం చేయడం కానీ సమస్యేలేదంటూ కొట్టివేయకుండా మర్రి బహిరంగంగా ఇస్తున్న తిరకాసు స్టేట్‌మెంట్లు ఒకవైపు, అంతరంగికులతో మాత్రం ఈనెలాఖరులోగా అంటూ ముహూర్తాలు కూడా చెప్పినట్లు వస్తున్న వార్తలు మరోవైపు, మర్రి కాంగ్రెస్‌లో చేరే విషయం తమ దృష్టికి రాలేదని తమను ఎవరూ సంప్రదించలేదని ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే డా.రాజేష్ రెడ్డిలు చెపుతున్న మాటలు ఇంకోవైపు ఎవరూ క్లారిటీ ఇవ్వకపోవడంతో ఇరుపార్టీల కార్యకర్తలు సస్పెన్స్ భరించలేకపోతున్నారు.

● ఎమ్మెల్యేగా హాట్రిక్ సాదిస్తా మంత్రినవుతానంటూ ఊదరగొట్టిన మర్రిమటలు నమ్మి కాంగ్రెస్ నేతలు కార్యకర్తలను అధికారులపై రెచ్చిపోయిన బిఆర్‌ఎస్ కార్యకర్తలు సోషల్‌మీడియా వారియర్స్ తమనేత ఆవలి గట్టుకు చేరేందుకు యత్నించడం ఒడ్డుచేరేదాకా ఓడమల్లన్న అన్న సామెతలా ఉందని ఇంతకాలం తమతో చేయించరాని పనులన్నీ చేయించి ఇప్పుడు తన స్వార్థం చూసుకుని నియోజక వర్గంతోపాటు పార్టీ సైతం వదిలి చల్లగా జారుకోవడం ఏంటి అని ప్రశ్నిస్తున్నారు. ఇక గెలిచిన కాంగ్రెస్ కార్యకర్తల్లోనూ ఇదే విధమైన ఆందోళన వ్యక్త మవుతున్నది.

మిగతా 2లో

# ప్రాజెక్టుల పేరుమీద ప్రజల సంపదను దోచారు

## - డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి




**మహబూబ్‌నగర్ అర్బన్ మేజర్‌న్యూస్:** ప్రాజెక్టు పేరుమీద గత కేసీఆర్ ప్రభుత్వం ప్రజల సంపదను దోపిడి చేసిందని డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో కృష్ణానది పరివాహక ప్రాంతం 68శాతం ఉంటే, ఏపీలో 32 శాతం ఉందని, కాని కృష్ణానది నీటి కేటాయింపులో కేవలం తెలంగాణకు 299 టీఎంసీల నీళ్లకే కేసీఆర్ ఒప్పుకున్నారని విమర్శించారు. ఏపీ ప్రభుత్వం కృష్ణానీళ్లను అక్రమంగా దోచుకెళుతున్నా పట్టించుకోలేదన్నారు. 16వ అపెక్స్ కౌన్సిల్ మీటింగ్లో బీఆర్ఎస్ అధికారంలోకి ఉన్నప్పుడూ కృష్ణారివర్ మేనేజ్మెంట్ బోర్డు ప్రాజెక్టులను తీసుకుంటే మాకు ఎలాంటి అభ్యంతరాలు లేదని తీర్మానం చేసింది మీరేకదా అని ప్రశ్నించారు. మిషన్ భగీరథలో రూ.7వేల కోట్లు అవినీతి జరిగిందని విజిలెన్స్ రిపోర్టు బయటపెట్టిందన్నారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి విచారణకు ఆదేశించడం జరగిందన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు రూ.27 వేల కోట్లు ఖర్చుచేసి 27 ఎకరాలకు కూడా నీళ్లు పారించలేదని ఆరోపించారు. కేసీఆర్ చేసిన దోపడిని తెలంగాణ ప్రజలకు తెలుసని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటమి తప్పదని హెచ్చరించారు. టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి 50 రోజుల్లోనే కొడంగల్-నారాయణపేట పథకానికి శ్రీకారం చుట్టారని, వారం రోజుల్లో అధికారిక అనుమతులు వచ్చే అవకాశం ఉందన్నారు. మాజీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇష్టానుసారంగా మాట్లాడుతుండడం సరికాదన్నారు. కాంగ్రెస్ జిల్లాను నిర్లక్ష్యం చేసిందని ఆరోపిస్తున్నారని, జూరాల, 'కల్వకుర్తి, కోయిలసాగర్, నెట్టంపాడు, బీమా, రిజర్వాయర్లను కట్టింది కాంగ్రెస్ ప్రభుత్వాలేనని గుర్తుచేశారు. కోయిలసాగర్ ప్రాజెక్టు కింద 20 వేల ఆయకట్టుకు నీళ్లుపారేలా దేవరకద్ర ఎమ్మెల్యే తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో డిసిసి ఉపాధ్యక్షులు చంద్రకుమార్ గౌడ్, జిల్లా మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు సాయిబాబా, రాములుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పదిలో పాలమూరు ప్రథమ స్థానంలో ఉండాలి

## - పాఠశాలలో ఉన్న సమస్యలు ఏవైనా నేను పరిష్కరిస్తా
## - ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్ నగర్, మేజర్ న్యూస్:** తెలంగాణ రాష్ట్రంలో జరిగే పదవ తరగతి పరీక్షల్లో మహబూబ్ నగర్ జిల్లా ను మొదటి స్థానంలో నిలుపాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. విద్యా యాత్రలో భాగంగా బుధవారం హన్వాడ మండలం లోని వేపూర్ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆత్మీయ కానుక 2డి/3డి డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ ను ఆవిష్కరించి, డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ క్యూఆర్ కోడ్ ద్వారా ఎలా వినియోగిస్తారో ఎమ్మెల్యే విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ప్రత్యేకంగా వివరించారు. ప్రతి ఒక్కరూ రీడింగ్ హాబిట్ ను అలవర్చుకోవాలి అని, అందులో భాగంగా ప్రతి రోజూ వార్తా పత్రికలను చదవడం వలన మనకు మేలు జరుగుతుంది, అని ఆయన చెప్పారు. అంతే కాకుండా, ఆంగ్ల భాష పైనా, హిందీ భాషల్లో ప్రావీణ్యం సంపాదించాలని ఆయన సూచించారు. విద్యార్థులకు మంచి వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రు లదే అని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల రోజుల పాటు పిల్లలకు ఎలాంటి మానసిక ఒత్తిడికి గురి చేయకుండా చూడాలని ఆయన విద్యార్థుల తల్లిదండ్రుల ను కోరారు. పాఠశాలలో ఏర్పాటు చేసే లైబ్రరీ కోసం ప్రతి పాఠశాలకు ఒకలక్ష రూపాయల ఫండ్ ను అందిస్తున్నట్టు ఆయన తెలిపారు. త్వరలో ప్రభుత్వం మెగా డిఎస్సీ ద్వారా ఖాళీగా ఉన్న ఉన్న టీచర్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టుతున్నదని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను అలరించాయి. ఈ కార్యక్రమంలో డిఇఓ రవీందర్, ఎంఇఓ రాజు నాయక్, జిహెచ్ఎం గోపాల్ నాయక్, సియంఓ బాలు యాదవ్, ఎయంఓ శ్రీనివాసులు, ఎంపిపీ బాలరాజు, ఎంపిటిసి బోయిని వెంకట్రాములు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టంకర కృష్ణయ్య యాదవ్, ఉపాధ్యక్షుడు జి.నర్సింహులు, యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుధాకర్ రెడ్డి, యాదవ రెడ్డి మరియు మునిమోక్షం ఉన్నత పాఠశాల, గొండ్యాల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతన్న సస్పెన్స్

(మొదటి పేజీ తరువాయి)

ఏండ్ల తరబడి ఆర్థికంగా మానసికంగా శారీరకంగా సమాజికంగా హింసలకు గురిచేసిన మంత్రి ఆయన అనుచరుల సరసన ఎలా కొనసాగేదంటూ ప్రశ్నిస్తున్నారు.

● కార్యకర్తల మనోభావాలు ఆందోళనలు ఎలా ఉన్నా మంత్రి చాపకింద నీరులా తన పనితాను చేసుకుంటూ వెలుతున్నట్లు సమాచారం. గతంలో వినియోగించిన బిఆర్ఎస్ ప్రచార రథాలకున్న స్టిక్కర్లను తొలగించి కొత్త స్టిక్కర్లు వేయించేందుకు వాటిని తరలించినట్లు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. కొత్త స్టిక్కర్లు ఉన్న పార్టీవా? కొత్తగా చేరనున్న పార్టీకి సంబందించినవా అన్నది సస్పెన్స్‌గా మారడం నాగర్‌కర్నూల్ నియోజకవర్గ రాజకీయాల్లో ఆసక్తి రేపుతుంది.

## అంగన్వాడీ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు సక్రమంగా ఉండేలా చూడాలి

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు ప్రతి వారం రివ్యూ నిర్వహించాలని ఆదేశించారు. ఫిబ్రవరి 7 నుంచి 14వ తేదీ వరకు అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహించనున్న స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ లో భాగంగా అంగన్వాడీ కేంద్రాల పరిశుభ్రత, సందర్శన ఉండేవిధంగా ఒకరోజు కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. తాగునీరు, మరుగుదొడ్లు, ఎత్తు బరువు కొలిచే పరికరాలు, ఆట వస్తువులు వంటి సౌకర్యాలు ఎక్కడ తక్కువ ఉన్నాయో తెలుసుకొని నివేదిక ఇవ్వాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు. అంగన్వాడీల్లో స్యామ్, మ్యామ్ పిల్లలకు బాలామృతం అందుతోందా లేదా అని ఆరా తీశారు. పిల్లలకు ఇచ్చే గుడ్లు నాణ్యతగా ఉండాలని లేదంటే అంగన్వాడీలు వాటిని అక్కడే తిరిగి పంపించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలు లేని గుడ్లను తీసుకోరాదని, ఒకవేళ నాణ్యత లేని గుడ్లు సరఫరా చేస్తే ఏజెన్సీలకు బిల్లులు ఆపాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలకు సంబంధించి ఆరోగ్య లక్ష్మీ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని ప్రతి వారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా సంక్షేమధికారి రామ మహేశ్వర్ రెడ్డి, సీడీపీఓలు, తదితరులు పాల్గొన్నారు.

## అంతటా అసంతృప్తి

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో కూడా బిఆర్‌యస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పార్టీ అగ్రనాయకుల పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ బియస్ కేశవ్ మాట్లాడుతూ గతంలో తాము కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు ఎంతో గౌరవం ఉండేదని ఆ తర్వాత టిఆర్‌యస్‌లో చేరిన తర్వాత తమ బతుకులు చప్రాసిలా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ కాని బిఆర్‌యస్ రాష్ట్ర నాయకులు గాని యేనాడు కూడా గద్వాల్ నియోజకవర్గంలో నాయకులను పట్టించుకోలేదు అని విమర్శించారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో కేశవ్ ఆగ్రహం వ్యక్తం చేయడం కొసమెరపు. నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని తామే దగ్గరుండి గెలుపించుకున్నా ము తప్ప పార్టీ చేసిన కృషి ఏమి లేదు అని విమర్శించారు. ఈ విధంగా ఆయా నియోజకవర్గాల్లో జరిగిన బిఆర్‌యస్ పార్టీ సమీక్ష సమావేశాల్లో మాజీల పనితీరుపై సొంతపార్టీ నాయకులే అసంతృప్తి వ్యక్తం చేయడం గమనించిదగ్గ విషయం. కాగా గత ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 14 అంసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీచేసిన బిఆర్‌యస్ అభ్యర్థుల్లో నడిగడ్డలోని గద్వాల, అలాంపూర్ తప్ప అన్నిచోట్ల పార్టీ అభ్యర్థులు చిత్తు చిత్తు ఓడిపోయిన విషయం ప్రజలకు తెలిసిందే.

## ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

### - సిఐటియు జిల్లా కార్యదర్శి, తెలంగాణ ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట ఆంజనేయులు



**వనపర్తి టౌన్, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ రంగ సంస్థలు బేవరేజెన్, ఎఫ్.సిఐ, ఎలక్ట్రిసిటీ స్టోర్, మార్కెట్, సివిల్ సప్లై, సిడబ్ల్యుసి,ఎస్ డబ్ల్యూ సి, రైల్వే గోదాములలో పనిచేస్తున్న హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి పే స్కేల్ అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి , తెలంగాణ ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం వనపర్తి మండల పరిధిలోని కడుకుంట్ల గ్రామంలోని కడుకుంట్ల బేవరేజెస్ గోదాం లో హమాలీ లు గోదాం డిపో మేనేజర్ ఇన్చార్జి సుబ్బారావు కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేస్తున్న హమాలీలందరికీ పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, కనీస పెన్షన్ రూ. 10వేలు అమలు జరిగే విధంగా హమాలి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 16న కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు చేపట్టిన కార్మికుల సమ్మె , గ్రామీణ భారత్ బంద్ లో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ బేవరేజెస్ హమాలి వర్కర్స్ యూనియన్ కడుకుంట్ల డిపో అధ్యక్షులు ప్రభాకర్ కార్యదర్శి రాజు, రామాంజన్ గౌడ్, నాయకులు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు జవాబు దారిగా ఉండాలి : నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి



**తిమ్మాజిపేట మేజర్ న్యూస్ :** అధికారులు తమ పద్ధతి మార్చుకొని ప్రజలకు జవాబు దారిగా ఉండాలని నాగర్కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం ఎంపీపీ రవీంద్రనాథ్ రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ కొందరు అధికారులు గత ప్రభుత్వం అధికారంలో ఉందని భావిస్తున్నారని గతం వదిలి ప్రస్తుత ప్రభుత్వానికి సహకరించాలని ఆయన సూచించారు. తాను గెలిచింది ప్రజల కోసమేనని అధికారులు ఉన్నది కూడా ప్రజల కోసమే అన్నారు సందర్భంగా సమాజంలో ఒక్కో శాఖ అధికారి తమ శాఖకు సంబంధించిన నివేదికలను చదివి వినిపించారు. మండలంలోని కొన్ని గ్రామాలలో మన ఊరు మన బడి పథకం కింద వివిధ స్థాయిలో నిర్మాణం పనులు జరుగుతున్నాయని ఏఈ రెడ్డప్ప తెలిపారు . బయోమెట్రిక్ విధానం లేకపోవడంతో కొందరు ఉపాధ్యాయులు తమ విధులకు సక్రమంగా రావడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రతి ఉపాధ్యాయుడు విధిగా సమయపాలన పాటించాల్సిందేనని ఆదేశించారు. విద్యుత్ సమస్య వచ్చినప్పుడు ఆ శాక అధికారులు కానీ సిబ్బంది గాని ఫోన్ ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని తిమ్మాజిపేట ఎంపీటీసీ సభ్యురాలు లీలావతి, పోతిరెడ్డిపల్లి ఎంపిటిసి తిరుపతయ్యు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కరెంటు తరచూ తీయడం వల్ల కాంగ్రెస్ వచ్చినందుకు ఇలా అని ప్రజల్లోనికి వెళ్ళిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు ఏమైనా అధికారులు పరిష్కరించేందుకు తక్షణం స్పందించాలని ఆయన సూచించారు గుమ్మకొండ గ్రామాల్లో లెవెన్ కె.వి విద్యుత్ లైన్ పైన పెద్ద లైను ఉండడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఎంపీపీ రవీంద్రనాథ్ రెడ్డి చెప్పారు. సమస్య పరిష్కరించేలా చూడాలని ఏఈకి సూచించారు. బుధవారం నుండి 15వ తేదీ వరకు ప్రతిరోజు పరిశుద్య కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఎంపీడీవో కరుణశ్రీ అధికారులకు సూచించారు. –మాజీ సీఎం కేసీఆర్ ఫోటో పై రగడ : మండల సర్వసభ్య సమావేశం సందర్భంగా రైతు వేదికలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ సమావేశంలో ప్రభుత్వం వచ్చినప్పటికీ కెసిఆర్ ఫోటో ఎందుకు తొలగించలేదని కాంగ్రెస్ రేణులు కొద్దిసేపు అధికారులతో వాగ్వాదానికి దిగారు. సమావేశానికి ఎమ్మెల్యేతో పాటు మండల కాంగ్రెస్ నాయకులు రైతు వేదిక లోకి వచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సీఎం రేవంత్ రెడ్డి ఉన్నప్పటికీ అధికారులు మాత్రం కేసీఆర్ ఫోటో తీయకుండా సమావేశం కూడా కొనసాగిస్తున్నారని ఇది సరైన విధానం కాదని అన్నారు. కేసీఆర్ ఫోటో కనబడ కుండా చేశాక మండల సమావేశం నిర్వహించుకోవచ్చని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. దీంతో అధికారులు మాజి సీఎం కేసీఆర్ ఫోటో కనబడకుండా పాత బ్యానర్ కట్టారు. ఈ సమావేశంలో ఎంపీపీ రవీంద్రనాథ్ రెడ్డి శ్రీనివాస్ యాదవ్ ఎంపీడీవో కరుణాశ్రీ ఎంపీ ఓ బ్రహ్మచారి ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నర్వ మండల వైన్ షాపుల్లో దారుణం

### - ఒక్కో బాటిల్ పై రూ.10 నుంచి 20 వరకు అధిక వసూళ్లు - పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

**నర్వ మేజర్ న్యూస్:** నర్వ మండలంలోని వైన్ షాపుల యజమానులు మద్యం అమ్మకాల్లో దారుణాలకు ఒడిగడుతున్నారు. దోపిడి దొంగల అవతారమెత్తి,అధిక ధరల పేరుతో మందుబాబులకు దారుణంగా దోచుకుంటున్నారు.కష్ట సుఖాల్లో కాస్తంత మద్యంతో ఓదార్పు పొందేందుకు, వైన్ షాపులకు వచ్చే మందుబాబులు, అధిక ధరల షాక్ నుంచి తేరుకోలేకపోతున్నారు. మద్యం అధిక ధరల ఫిర్యాదులు అధికారులకు ఎన్ని వెళ్లిన,పట్టించుకోకపోవడంతో వైన్ షాపు నిర్వాహకుల ఆగడాలకు అడ్డుఅదుపులేకుండా పోయిందని,ప్రజలు చర్చించుకుంటున్నారు.ఎక్సైజ్ చట్టాలను కాపాడవలసిన అధికారులే నిమ్మకు నీరెత్తినట్లు ఉండిపోతే,సామాన్య జనాల పరిస్థితి పట్టించుకునే నాథుడే కరువయ్యాడని, మద్యం ప్రియులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అధికారుల పర్యవేక్షణ కేవలం రికార్డుల తనిఖీలకే,పరిమితమయ్యిందని,వైన్ షాపుల నిర్వహణ ఎలా ఉంటే తమకేంటన్నట్లు వారు ప్రవర్తించడం తీవ్ర విమర్శలు తావిస్తోంది.నిబంధనలకు విరుద్ధంగా బెల్టులకు మద్యం తరలింపు,పర్మిట్ రూం ల నిర్వహణ,ధరల పట్టిక,21ఏళ్ల లోపు వయస్సు వ్యక్తులకు మద్యం అమ్మరాదనే సూచిక బోర్డ్ లేకపోవడం ఇలా చెప్పుకుంటూ పోతే,వైన్ షాపు నిర్వహకులపై కేసులు నమోదు చేసి,లైసెన్సులు రద్దు చేయడం తప్పా మరోమార్గం లేదు.ఇప్పటికైనా నిద్రావస్థలో ఉన్న అధికారులు తేరుకుంటారా, లేక మామూళ్ల మత్తులోకే జారుకుంటారో..వేచి చూడాల్సిందే.

## గురుకుల పాఠశాల నందు మెనూ ప్రకారం భోజనం : అందడం లేదని రోడ్ ఎక్కిన విద్యార్థుల



**ధరూర్, మేజర్ న్యూస్ :** ధరూర్ మండల పరిధిలోని మార్లబీడు గ్రామ శివారులో గల మహాత్మ జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాల జూనియర్ కళాశాలలో మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని బుధవారం విద్యార్థులు ఆందోళన చేపట్టారు.గురుకుల పాఠశాల నుండి కాలి నడకన కలెక్టరేట్ కు సుమారు 200 మంది విద్యార్థులు బయలుదేరగా... విషయం తెలుసుకున్న ధరూర్ పోలీసులు వారిని పాఠశాలకు తరలించే ప్రయత్నించారు. దీంతో రోడ్డుపై నినాదాలు చేశారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. నాణ్యమైన భోజనం అందించాలని ప్రిన్సిపాల్ రాంబాబు దృష్టికి తీసుకువెళితే వేధింపులకు గురి చేస్తున్నాడని పేర్కొన్నారు. ఫుడ్ కమిటీ ప్రకారం ప్రతి రోజు తీసుకోవాల్సిన మెనూ ఆన్ లైన్ లో ఎంట్రీ చేయాలి. మెనూ ప్రకారం కోడిగుడ్లు, చికెన్ పెట్టకుండా ఆన్ లైన్ లో ఎంట్రీ చేసి బిల్లులు కాజేస్తున్నారని, ప్రభుత్వం నుంచి విద్యార్థులకు రావల్సిన బిల్లును ప్రిన్సిపాల్ ఇవ్వకుండా ఎగగొడుతున్నారని ఆరోపించారు. కూరగాయలు కిరాణం సరుకులలో అధిక బిల్లులు వేసి దోచుకుంటున్నారని విద్యార్థులు ఆరోపించారు.అనేక బిల్లులు తారుమారు చేసిన ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. అనంతరం ధరూర్ ఎస్ఐ విజయ్ కుమార్ విద్యార్థులకు నచ్చ చెప్పడంతో విద్యార్థులు పాఠశాలకు వెనుదిరిగి వెళ్లారు. దీనిపై ప్రిన్సిపల్ రాంబాబు ను వివరణ కోరగా పెరుగుతున్న నిత్యావసర ధరలను దృష్టిలో పెట్టుకుని అందుబాటులో ఉన్న మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

## స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు సద్వినియోగం చేసుకోవాలి



**నర్వ మేజర్ న్యూస్ :** ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాలను పెంచుకునేందుకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఎంతో ఉపయోగపడతాయని,వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పెద్ద కడుమూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నర్సిములు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో బుధవారం పెద్ద కడుమూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశానికి నర్వ మండల పరిధిలోని రెండు కాంప్లెక్స్ ల నుండి 50 శాతం ప్రాథమిక ఉపాధ్యాయులు హాజరు అయ్యారు. నర్వ కాంప్లెక్స్ సెక్రెటరీ మల్లేష్ రిసోర్స్ పర్సన్ గా వ్యవహరిస్తూ ఉపాధ్యాయులకు పలు అంశాలపై శిక్షణను ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో తొలిమెట్టు అమలులో భాగంగా విద్యార్థులు యొక్క గణిత సామర్థ్యాలను మెరుగుపరచాలన్నారు. ముఖ్యంగా గణితం లోని గుణకార, భాగహార ప్రక్రియలను సులభంగా అర్థం చేయించటంపై దృష్టి పెట్టాలన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ విద్యార్థులలో గణిత భావనలను పెంపొందించుటకు బోధనోపకరణాలను ఉపయోగిస్తూ బోధించాలన్నారు.పుస్తకంలో ఉన్న కృత్యాలతో పాటు నిత్యజీవితంలో ఉపయోగించే అంశాలను జోడిస్తూ బోధన చేయాలన్నారు.జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిలువు రాళ్లు మ్యాగజిన్‌ను ప్రతి పాఠశాల యొక్క లైబ్రరీలో అందుబాటులో ఉంచి విద్యార్థులు చదివేలా ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ రెడ్డి, వెంకటన్న, తిరుపతయ్య, హరీష్, ప్రదీప్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు రవి కుమార్, విష్ణు,క్రిష్ణ,సీఆర్పీ నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

## దేవరకద్ర ఎస్సైని సన్మానించిన మండల కాంగ్రెస్ నాయకులు



**.దేవరకద్ర మేజర్ న్యూస్ :** దేవరకద్ర మండల కేంద్రానికి నూతన ఎస్సైగా పదవి బాధ్యతలు స్వీకరించిన నాగన్న సార్ గారిని. కాంగ్రెస్ మండల నాయకులు. యూత్ వైస్ ప్రెసిడెంట్ చందు గౌడ్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు రాములు. మర్యాదపూర్వకంగా కలిసి వారి నీ శాలువతో సత్కరించి సన్మానించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మాతృ మరణాలపై సమీక్ష



**గద్వాల ప్రతినిధి, మేజర్‌న్యూస్:** వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. శశికళ ఆధ్వర్యంలో మాతృ మరణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో జోగులాంబ గద్వాల జిల్లాలో మాతృ మరణాలు జరగకుండా ఉండాలంటే వైద్య సిబ్బంది అందరూ గర్భిణీ స్త్రీలకు పోషకాహారం గురించి, ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత సేవల గురించి, ఉచిత పరీక్షల గురించి అవగాహన కల్పించాలని కోరారు. వైద్య సిబ్బంది అందరూ సాధ్యమైనంత తొందరగా ప్రమాదకర లక్షణాలు కలిగి ఉన్న గర్భిణీ స్త్రీలను గుర్తించి వారిని నిపుణులైన వైద్యాధికారులచే సేవలందించి ,చికిత్స చేసినట్లయితే మాతృ మరణాలను అరికట్టవచ్చునని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో డాక్టర్ అనురూప, డాక్టర్ నరసింహులు, డాక్టర్ స్రవంతి, డాక్టర్ ప్రసూన రాణి, రామాంజనేయులు సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్యక్రమం



**వడ్డేపల్లి మేజర్ న్యూస్:** మండలపరిధిలోని బుడమోర్స్ గ్రామంను బుధవారం జిల్లా పరిషత్తు ఉప ముఖ్యకార్యనిర్వాహణ అధికారి ముషాహెదా బేగం సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నేటి నుంచి తలపెట్టిన స్పెషల్ శనిటేష పశున్ డే ను పురస్కరించుకొని గ్రామంలో జరుగుతున్న పరిశుద్య పనులను పరిశీలించారు. మురుగు నీరు రోడ్డు పై పారకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలాన్నారు. గ్రామంలో ఉన్న నర్సరీ ని సందర్శించి, బ్యాగు లను విత్తనాలతో నింపాలని, అవి అంకురార్పణ వచ్చేలా చూడాలని నర్సరీ నిర్వాహకులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రంను తనిఖీ చేసి, విద్యర్థిని, విద్యర్థులకు మంచి పౌష్టిక ఆహారం ఇవ్వాలి అని అన్నారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి సత్య ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులుగా డి మనోహర్



**పాలమూరు మేజర్‌న్యూస్:** జడ్చర్ల పట్టణానికి చెందిన డి మనోహర్‌ను మహబూబ్నగర్ జిల్లా ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్గా నియమిస్తూ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మారగల సాయిబాబా బుధవారం స్థానిక డిసిసి కార్యాలయంలో డి మనోహర్‌కు నియామ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ దళితుల సమస్యలపై పనిచేయాలని, కాంగ్రెస్ పార్టీ నియమ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గాంధీభవన సెక్రటరీ శ్రీనివాసులు గారు తదితరులు పాల్గొన్నారు.

## కెటిదొడ్డి గ్రామానికి స్పెషల్ ఆఫీసర్: ఏఈ లక్ష్మీనారాయణ



**గద్వాల మేజర్‌న్యూస్:** జోగులాంబ గద్వాల జిల్లా కెటిదొడ్డి గ్రామానికి నూతన స్పెషల్ ఆఫీసర్ గా బుధవారం రోజు భాధ్యతలు స్వీకరించిన ఇరిగేషన్ శాఖ ఏఈ లక్ష్మీనారాయణ ని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి న కెటిదొడ్డి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఈ సందర్భంగా గ్రామ సభలో డోజర్‌తో రైతు వేదిక నుంచి రోడ్డు వరకు పైన ఉన్న మట్టి తీయుట, కరెంట్ స్తంభాలకు బల్బులు వేయుట, రోడ్డు ఇరువైపులా చెట్లు నాటడం పనులను తీర్మానం చేయడం జరిగింది. స్పెషల్ ఆఫీసర్ ఆయా వార్డులో డ్రైనేజీ కాలువలు పరిశీలించి వాటికి అవసరమైన సామగ్రిని వెంటనే తెప్పించి రెండు మూడు రోజుల్లో మరమ్మతులు చేయాలని పంచాయతీ కార్యదర్శికు చెప్పండం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కె.విష్ణుచిత్తుడు, కె.తిరుపతి, బి.జంగిలప్ప, రామకృష్ణ,మైబు, వీరన్న వీరేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రంగన్న, పంచాయతీ కార్మికులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మంగనూరులో విద్యార్థులకు పారిశుధ్యం పై అవగాహన



**బిజినపల్లి మేజర్‌న్యూస్:** వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ఈనెల12నుంచి19 వరకు ప్రత్యేకంగా జిల్లాలో ప్రత్యేకంగా నిర్వహిస్తున్న నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలపరిధిలోని మంగళూరు గ్రామంలో పాఠశాల విద్యార్థులకు ఆరోగ్యం, పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమాన్ని లట్టుపల్లి వైద్యధికారి డాక్టర్ బి. శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల పరిధిలోని మంగనూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,గ్రామపంచాయతీ పక్కనగల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చేతిశుభ్రత, పారిశుధ్య ఆరోగ్యం, నివారణ చర్యలపై వైద్యాధికారి డాక్టర్ బి శ్రీకాంత్ విద్యార్థులకు పలుసూచనలు చేశారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కృష్ణయ్య విద్యార్థులకు పారిశుధ్యం పై వివరించారు.ఆరోగ్య విస్తీర్ణాధికారి పోల శ్రీధర్ నేటి సమాజంలో విద్యార్థుల ఆరోగ్యం అభివృద్ధి పరచుటకు తగు సూచనలు చేశారు. వ్యక్తిగత ఆరోగ్యాన్ని పాటిస్తూ పరిసరాల శుభ్రత పాటించాలని కోరారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులచేతి శుభ్రతల పాటింపులపై వివరించారు. ప్రతి విద్యార్థినిత్యం శుద్ధమైన నీరు, పౌష్టికాహారాన్ని తీసుకోవాలని తెలిపారు ఈకార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు తిరుపతయ్య డిప్యూటీ సర్పంచ్ రామకృష్ణ,ప్రధాన ఉపాధ్యాయులు ఎం. తిరుపతయ్య,నాగేశ్వర్ రెడ్డి,ఆరోగ్య కార్యకర్తలు పి.పద్మ,టి.యాదగిరి, ఉపాధ్యాయులు ఫణి కుమార్,రామన్ గౌడ్, ప్రసాద్,రాజేందర్, పంచాయతీ కార్యదర్శి విమల,ఆశాకార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాతా రమాబాయి అంబేడ్కర్ 127వ జయంతి వేడుకలు



**అచ్చంపేట అర్బన్ మేజర్ న్యూస్:** అచ్చంపేటలో సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంధం స్వామి ఆధ్వర్యంలో మాత రామబాయి అంబేద్కర్ 127 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా గంధం స్వామి మాట్లాడుతూ నాటి రామాబాయి అంబేద్కర్ త్యాగమే నేటి మన సుఖమైన జీవనానికి ఆధారం,కడుపులో పుట్టిన బిడ్డల్ని సైతం మన కోసం త్యాగం చేసిన త్యాగశిలి తాను బాబాసాహెబ్ అంబేద్కర్ ని ఉన్నత చదువులు చదివేల ప్రోత్సహించి,భారత రాజ్యాంగం ద్వారా అడుగడుగునా మనకు రక్షణ కల్పించిన రక్షణ కవచం తాను, నేడు ఆ తల్లి త్యాగం పునాధుల మీదనే మన జీవన విధానం ముందుకు సాగుతుందని సగర్వాంగా సమాజానికి తెలుపుదమని తెలిపారు.బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాల వద్ద ప్రధాన చౌరస్తాలలో పాఠశాలలో కళాశాలలో అన్ని రకాల విద్యాలయాలలో మన వాడలలో మన గడపలో చదువుతున్న బిడ్డలకు రామాబాయి త్యాగాన్ని పరిచయం చేద్దాం అని తెలియజేశారు.కార్యక్రమానికి మీసాల విజయ్ కుమార్,ఆల్ మాల స్టూడెంట్ నాయకులు చెన్నయ్య,రేనయ్య గౌడ్, నరేందర్,రవి,సమతా సైనిక్ దళ్ నాయకులు తైలి శ్రీధర్, సురేష్,వెంకటయ్య,శ్రీరాములు,జర్నలిస్ట్ రవికుమారు,తదితరులు పాల్గొన్నారు.

## అయిజలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ పోటీలు



**అయిజ మేజర్ న్యూస్ :** జోగులాంబ గద్వాల జిల్లా ఐజ పట్టణ పరిధిలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఐజ నందు సైన్స్ క్విజ్ పోటీలు నిర్వహించబడుతున్నాయి. ఇట్టి కరపత్రికను బుధవారం చైర్మన్ దేవన్న చేతుల మీదుగా నిర్వాహకులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గద్వాల జిల్లాలోని అన్ని ప్రభుత్వ కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న 8,9,10 తరగతి విద్యార్థిని విద్యార్థులకు జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఐజ నందు జల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ విద్య నిర్వహిస్తున్నాం ఇలాంటి టాలెంట్ టెస్ట్ క్విజ్ వలన విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి కలిగి భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ఉపయుక్తంగా ఉంటుంది కాబట్టి డీఈవో ఆదేశించిన ప్రకారం విద్యార్థులను వారి గైడ్ టీచర్ సకాలంలో ఉండవలసిందిగా తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా కలెక్టర్ , ఎస్పీ, జిల్లా విద్యాశాఖ అధికారి వస్తున్నారు. ఈ క్విజ్ పోటీలో మొదటి బహుమతి 6000 రెండో బహుమతి 3000 రూపాయలు మూడో బహుమతి 1500 రూపాయలు విద్యార్థులకు కేవలం బహుమతులు కోసమే కాకుండా మీ యొక్క నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి అలాగే మీ యొక్క ఆత్మవిశ్వాసాన్ని దృఢపరుచుకోవడానికి ఈ పోటీలలో పాల్గొనాలని పంపించే అధ్యాపకులు కూడా అలాంటి వారిని పంపించాలని క్విజ్ నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రోగ్రాం యొక్క నియమ నిబంధనలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు సంప్రదించి తెలుసుకోగలరు.

## ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రుల వారిని సన్మానించిన కాంగ్రెస్ నాయకుడు షెక్షావాలి



**అయిజ మేజర్ న్యూస్ :** అయిజ పట్టణ పరిధిలో భారత అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడు యాత్ర సందర్భంగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీ( తిక్క వీరేశ్వర స్వామి ప్రీమియర్ లీగ్) కు అయిజ పట్టణ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులను టోర్నీకి ప్రత్యేక ఆహ్వానితులుగా పిలిచి వారిని ఒక్కొక్కరిగా గౌరవార్థం మేమెంటో శాలువాలతో సన్మానించి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా షెక్షావల్లి మాట్లాడుతూ దేశంలో పాలన మారాలంటే అధికారులు మారాలని అధికారులు మారాలంటే కాంగ్రెస్కు గెలిపించాలని కాంగ్రెస్కు గెలిపిస్తే యువతకు ప్రతి ఒక్కరికి అన్ని విధాలుగా అభివృద్ధి జరుగుతుందని తెలిపారు యువకులు తప్పకుండా ఆట పోటీలలో రాణిస్తూ సరైన మెలకువలు నేర్చుకోవాలని తెలిపారు. ఒక వార్త నాయకులు నుంచి ప్రజలకు కానీ ప్రజల నుంచి నాయకులకు కానీ రావాలి అంటే మీడియం మిత్రులు ఎంతో కృషి ఉంటుందని కాబట్టి మీడియా మిత్రులు ఎవరైనా మంచిగా మనం గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని వారికి దక్కాల్సిన సరైన గౌరవం సమాజంలో దక్కడం లేదని ఇలాంటి సందర్భంలో ప్రభుత్వం నుండి అన్ని విధాలుగా సహాయసహకారాలు అదెలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులతో పాటు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉపన్యాస పాటలు చిత్రలేఖనం పోటీలు



**గోపాలపేట మేజర్ న్యూస్ :** గోపాలపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు చిత్రలేఖనం ఉపన్యాసం కవిత్వం పాటల పోటీలను నిర్వహించారు పోటీలో గెలుపొందా రని కవిత్వం బాబులాల్ ఉపన్యాసం కే శైలజ పాటల పోటీలో శిరీష చిత్రలేఖనంలో సుమ శ్రీ విజేతగా గెలిచినట్లు హెచ్ ఎం రమాకాంత్ తెలిపారు.

## సతీష్ మాదిగ నోరు అదుపులో పెట్టుకో



**దామారగిద్ద మేజర్ న్యూస్ :** చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను కులం పేరుతో తిట్టడమే బూతులు తిట్టడం సరికాదు నువ్వు ఒక దళితుడువై ఉండి సాటి దళితుల్ని తిట్టడం సరైనది కాదనీ మాలల ఐక్యా వేదిక జిల్ల అధ్యక్షుడు గ్యాంగు హన్మంతు మండి పడ్డారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరె సతీష్ నీవు కూడా గతంలో కేసీఆర్ పరిపాలనలో తెలంగాణ ఉద్యమంలో కూడా నీవు పాటలు పాడినావు మరి నీవు ఎంగిలి మెతుకు తినలేదా ? ఇది సరి అయిన పద్ధతి కాదు నోరు అదుపులో పెట్టుకోవాలని అయన హెచ్చరించారు.

## డీఎస్ఓను సన్మానించిన రాజకుమార్ స్వచ్ఛంద సంస్థ



**గద్వాల మేజర్ న్యూస్:** జోగు లాంబ గద్వాల జిల్లా పౌరస రఫరాల అధికారి రేవతి నీ రాజ్ కుమార్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకురాలు రత్నకుమారి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. అలాగే పాండు, సుదర్శనం, భాస్కర్ రెడ్డి, మోషన్నలోను శాలువాతో మోమెంటో అందజేసి సన్మానించారు. రాజ్కుమార్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా నిరుపేదలకు సేవలందించేందుకు సహకారము అందించి నందుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ముకుందరావు జి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ ప్రజలకు సేవ చేయడమే నా లక్ష్యం : మాజీ సర్పంచ్ కృష్ణయ్య



**కోయిలకొండ మేజర్ న్యూస్:** ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి ప్రజలకు సేవ చేయడమే నా లక్ష్యం అని మాజీ సర్పంచ్ కృష్ణయ్య తెలిపారు. బుధవారం మండలకేంద్రంలో ఉన్న గ్రామపంచాయతీ కార్యాల యంల గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రజలు గ్రామపంచాయతీ పాలకవర్గం పదవి పూర్తయిన సందర్భంగా మాజీ సర్పంచ్‌కి వార్డు మెంబర్లకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలో ఉన్న ప్రతి వీధిని ఎంతో అభివృద్ధి చేశానని ఆయన తెలియజేశారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా ఆదుకోవడం జరిగిందని గుర్తు చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్, ఎంపీటీసీ రోజా జగన్ గౌడ్, కో ఆప్షన్ నెంబర్ ఖా జా మైనోద్దీన్, మాజీ ఉప సర్పంచ్ ఖా జా నవాజ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జి.రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు విద్యాసాగర్ గౌడ్, నాగరాజు, వీరన్న పల్లి రమేష్, రామస్వామి, గౌస్, పాషి, షేమీ0,రాజ్ కుమార్, అశోక్ కుమార్, నారాయణ గౌడ్, లక్కీ లక్ష్మీనారాయణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 16న సమ్మె పిలుపు జతా ప్రారంభం



**పాలమూరు మేజర్ న్యూస్ :** ఈ నెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ప్రచార రతాన్ని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్ కురుమూర్తి భవన నిర్మాణ రంగా కార్మికులు సిఐటి నాయకులతో కలిసి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో తెలంగాణ బిల్డింగ్ అధర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు, సిడబ్ల్యూఎఫ్ఐ) సిఐటియు పట్టణ కన్వీనర్ రాజ్కుమార్, నందు, ప్రవీణ్, రాజు, శ్రీను కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## నవాబుపేట ఎస్సైగా బాధ్యతలు తీసుకున్న అభిషేక్ రెడ్డి



**నవాబ్ పేట మేజర్ న్యూస్ :** నవాబ్ పేట మండల నూతన ఎస్సై గా అభిషేక్ రెడ్డి బుధవారం భాద్యతలు చేపట్టారు. గత మూడు నెలలుగా పోస్టు ఖాళీగా ఉంది. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణలో తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న ప్రజలకు అందుబాటులో ఎస్సై లేకపోవడం వల్ల ఇప్పుడు ఎస్సై రావడం ప్రజలు ఆనందోత్సాహాలతో ఉన్నారు.

## జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

### : జిల్లా కలెక్టర్ పి ఉదయ్ కుమార్



**నాగర్‌కర్నూల్, మేజర్ న్యూస్ :** ఈ నెల 12వ తేదిన నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని వైద్య ఆరోగ్య, విద్యాశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసే ఘనంగా నిర్వహించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ పి. ఉదయ్ కుమార్ అన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, సంక్షేమ శాఖ అధికారులతో జాతీయ నులిపురుగుల,పల్స్ పోలియో పై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 12న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం ఘనంగా నిర్వహించాలని ఆయన సూచించారు. జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల లోపు గల 208115 మంది విద్యార్థులకు అల్బేండోజల్ 400 ఎంజి మాత్రలను నులిపురుగుల నివారణ కోసం సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. అంగన్‌వాడి కేంద్రాలు, ప్రభుత్వ ప్రైవేటు, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు మాత్రలు అందించాలని, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ స్కూల్, ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ,ప్రైవేట్ జూనియర్ కాలేజీ,ల విద్యార్థులందరికీ తప్పనిసరిగా అల్బెండజోల్ టాబ్లెట్ వేయించాలని ఆదేశించారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం అందుకు సహకరించాలన్నారు. అదేవిధంగా మార్చి మూడోవ తేదీ నుండి నుండి మార్చ్ 5వ తేదీ వరకు (మూడు రోజులు) పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నామని, మన జిల్లాలో 0 – 5 వయసు ఉన్న 88 వేల మంది పిల్లలకు వైద్య సిబ్బంది అందరూ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. సూపర్వైజర్లు,ఆరోగ్య కార్యకర్తలు, ఆశలు, ముఖ్యంగా హై రిస్క్ ప్రాంతాలైన, ఇటుక బట్టీలు, చేపలు పట్టే ప్రాంతాలు ,కన్స్ట్రక్షన్ ఏరియాలో, అర్బన్ స్లం మైగ్రేషన్ ప్రాంతాలు, బిచ్చగాళ్లు నివాసముండే ప్రాంతాల్లో, ఉండే 0 –5 పిల్లలందరికీ తప్పకుండా పల్స్ పోలియో చుక్కలు వెయ్యాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంచార్జ్ వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి నాయక్ ఉప–వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డాక్టర్ వెంకట దాస్, డాక్టర్ తారా సింగ్, భీమా నాయక్, డిపిఓ కృష్ణ బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీధర్ జి, ప్రైవేటు పాఠశాలల కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ వివిధ లైన్ డిపార్ట్మెంటు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 16న గ్రామీణ బంద్ కార్మికుల సమ్మెను జయప్రదం చేయండి

### - రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎండి జబ్బార్



**పానగల్, మేజర్ న్యూస్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా జెయింట్ ప్లాట్ ఫారం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, ఉద్యోగ సంఘాలు, అఖిలభారత ఫెడరేషన్లతో పాటు కిషాన్ మోర్చా అఖిల భారత సంఘాల స్థాయిలో సంయుక్తంగా ఫిబ్రవరి 16న నిర్వహిస్తున్న గ్రామీణ బంద్, కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎండి జబ్బార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్, ప్రజాసంఘాల సమావేశం వెంకటయ్య అధ్యక్షతన నిర్వహించారు, సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎండి జబ్బర్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎండి జబ్బార్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేటు, మతతత్వ విధానాలను ధిక్కరిస్తూ ప్రతిఘటనకు పూనుకోవాలని కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై చార్ సీట్ ప్రకటిస్తూ లక్షలాది కుటుంబాల ఇంటింటికి వెళ్లి ప్రజలకు ప్రభుత్వ విధానాలు వివరించాలన్నారు, తెలంగాణ రాష్ట్రంలో కార్మికుల సమ్మె, గ్రామీణ బంద్ ను జయప్రదం చేయాలని, చారిత్రాత్మకమైన రైతంగ పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరహిస్తూ రైతులకు రాతపూర్వకంగా హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు, రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించలేదు. ఆందోళన సందర్భంగా చనిపోయిన 750 రైతు కుటుంబాలకు పరిహారం ఇవ్వలేదని గుర్తు చేశారు, అక్రమ కేసులను ఎత్తి వేయడంతో పాటు, మృతి చెందిన రైతుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు, అనంతరం బంద్ కు సంబంధించిన గొడవ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహకార కార్యదర్శి సూర్యవంశం రాము, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వేణు, కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం వెంకటయ్య, సిఐటియు జిల్లా నాయకులు జి వెంకటయ్య, రైతు సంఘం మండల అధ్యక్షులు జంబులయ్య, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు ఆంజనేయులు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు గంధం భగత్ తదితరులు పాల్గొన్నారు.

## సంత్ సేవాలాల్ జయంతినీ ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలి

### - తాహసిల్దారుకు వినతి పత్రం అందజేసిన బిజెపి గిరిజన నాయకులు



**బాలానగర్ మేజర్‌న్యూస్:** ఫిబ్రవరి 15వ తేదీ సంతు శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతినీ పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వం ఒకరోజు సెలవు దినాన్ని ప్రకటించాలని భారతీయ జనతా పార్టీకి చెందిన గిరిజన నాయకులు తాసిల్దార్ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. బుధవారం ఈమెరకు గిరిజన ప్రజల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి రోజు ప్రభుత్వం అధికారకంగా సెలవు ప్రకటించాల్సిందేనని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళ మోర్చ మండల మాజీ అధ్యక్షురాలు, ఖేతావత్ లక్ష్మి, ఎస్టీ సేల్ అధ్యక్షుడు జాతావత్ మోహన్ నాయక్, బీజేవైఎం మండల అధ్యక్షుడు సబావత్ కుమార్ నాయక్, మాజీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు కే.శ్రీను నాయక్, నందు, ప్రసాద్, నర్సింహ, హరియ బాలానగర్ బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యపానం సేవించి వాహనాలు నడపరాదు : మక్తల్ సిఐ చంద్ర శేఖర్



**మక్తల్, మేజర్ న్యూస్:** జిల్లా యస్.పి యోగేష్ గౌతమ్ ఐ.పి.యస్ ఆదేశాల మేరకు మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలో యన్. హెచ్ –167 పై రోడ్డు ప్రమాదాలు నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు మక్తల్ సిఐ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం రోజు యస్.ఐ భాగ్యలక్ష్మి రెడ్డితో కలిసి మక్తల్ పరిధిలో యాక్సిడెంట్ ప్రొన్ ఏరియాస్ 09 గుర్తించడం జరిగింది. జాతీయ ప్రధాన రహదారికి కలుపుతూ ఉన్న గ్రామీణ రోడ్లపై ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే వాటిని గుర్తించి గ్రామాల నుండి హైవే పైకి వచ్చే రోడ్డుకు స్పీడ్ బ్రేకర్లు, వైట్ పాయింట్, సైన్‌బోర్డ్స్‌లేని వాటిని గుర్తించడం జరిగిందని వాటిని త్వరలో వేయించడం జరుగుతుందని సిఐ తెలిపారు. అలాగే రోడ్డుకు మలుపుల దగ్గర సైన్ బోర్డ్స్ ఏర్పాటు తదితర చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు నివారణకు ప్రజలు క్రింది నిబంధనలు తప్పకుండా పాటించాలని తెలిపారు. రహదారులపై వాహన దారులు ప్రయాణిస్తున్నప్పుడు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ సైన్ బోడ్స్ ను గమనిస్తూ వెళ్లాలి. ద్విచక్ర వాహనదారుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, కారు డ్రైవింగ్ చేసేవారు విధిగా సీట్ బెల్ట్ ధరించాలని.రహదారి పైకి వెళ్లే సమయంలో, రోడ్డు క్రాస్ చేసే సమయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని.చిన్న పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వరాదని. మద్యపానం సేవించి వాహనాలు నడపరాదని. మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదని.ప్రతి ఒక్కరు డ్రైవింగ్ చేసి సమయంలో వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు రిజిస్ట్రేషన్, లైసెన్స్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్స్ కలిగి ఉండాలని త్రిబుల్ రైడింగ్ లో వాహనాలు నడపరాదు.రష్ డ్రైవింగ్ చేయరాదు అని. జిల్లాలో ప్రజలందరూ పై నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని సిఐ విజ్ఞప్తి చేశారు. సిఐ తో పాటు యస్.ఐ భాగ్యలక్ష్మి రెడ్డి ఉన్నారు.

## వడ్డెర ఆత్మగౌరవ సభను విజయవంతం చేయండి



**గోపాలపేట మేజర్ న్యూస్** : హైదరాబాద్ రవీంద్ర భారతి లో ఫిబ్రవరి 11న నిర్వహించే వడ్డెర ఆత్మ గౌరవ సభను విజయ వంతం చేయాలని వడ్డెర నాయకులు మండల కేంద్రంలో పోస్టర్లు విడుదల చేశారు జిల్లా గౌరవ అధ్యక్షులు పశువుల గోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జాతీయ కార్యదర్శి జరుపటి ఈశ్వర్ రాష్ట్ర నాయకులు పిట్ల కతల్ జిల్లా అధ్యక్షులు దాసర్ల భూమయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆత్మ గౌరవ సభకు జాతీయ అధ్యక్షులు వేముల వెంకటేష్ హాజరవుతారని సభను విజయవంతం చేయాలని కోరారు వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చి వడ్డెర హక్కులను కల్పించాలని గుట్టలపై వడ్డెరలకు పూర్తి హక్కులు కల్పించాలని వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు వడ్డెర ఆత్మగౌర సభకు జిల్లాలోని వడ్డారని వేలాది మంది తరలి రావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మండల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ జిల్లా నాయకులు బలరాం పెద్దమందడి మండల అధ్యక్షులు వెంకటేష్ దస్తగిరి ఆంజనేయులు వెంకటయ్య మాసయ్య లింగస్వామి బాబు ఈశ్వర్ రమేష్ వెంకటస్వామి రాంబాబు తదితరులున్నారు.

## మహ్మదాపూర్‌లో పర్యటించిన వైద్య బృందం



**పానగల్, మేజర్‌న్యూస్:** మండలపరిధిలోనే మహ్మదాపూర్ గ్రామంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి రామయ్య ఆధ్వర్యంలో వైద్య బృందం బుధవారం పర్యటించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అసంక్రమిక వ్యాధులు హైపర్ టెన్షన్ డయాబెటిక్ ఉన్న వ్యాధిగ్రస్తులకు ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు, గ్రామపంచాయతీ పరిశుద్ధ గ్రహ కార్మికులకు తహసిల్దార్ అశోక్ కుమార్ చేతుల మీదుగా సానిటరీ వస్తువులను పంపిణీ చేశారు, అనంతరం చింతకుంట గ్రామంలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని కమిటీ హెల్త్ అధికారి రామయ్య పర్యవేక్షించారు, కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి కొండా శ్రీనివాస్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్యేకధికారికి ఘన సన్మానం



**వీపనగండ్ల, మేజర్ న్యూస్:** మండలంలోని రంగవరం గ్రామానికి ప్రత్యేక అధికారిగా మండల ఎంపిఓ శ్రీనివాసరావు ఇటీవలే భాద్యతలు చెప్పట్టారు. బుధవారం కాంగ్రెస్ సినీయర్ నాయకులు బుచ్చన్నసాగర్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక అధికారికి శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి బాలశేషు. మనతెలంగాణ విలేకరి వేముల తిరుపతయ్యసాగర్ ప్రత్యేకధికారిని సన్మానించారు. ఎంపీఓ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యులు కావాలని వేసవిలో తాగునిటీ సమస్య తలెత్తకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వ పరంగా జరిగే అభివృద్ధి పనులు సకాలంలో జరిగేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో రమేష్ అంగన్వాడీ కార్యకర్త చంద్రకళ ఆశ వర్కర్లు. పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## గోపాలపేట, రేవల్లి మండలాలకు రూ 3, కోట్ల 69 లక్షలు సీసీ రోడ్లకు నిధులు మంజూరు



**గోపాలపేట మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధి శాఖ పథకం ద్వారా గోపాలపేట రేవల్లి మండలాలకు మూడు కోట్ల 69 లక్షల రూపాయలు సిసి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు మండల కాంగ్రెస్ నాయకులు విలేకరులకు తెలిపారు ఇందులో గోపాలపేట మండలానికి రెండు కోట్ల 38 లక్షలు మంజూరు చేయగా రేవల్లి మండలానికి కోటి 30 ఒక లక్ష రూపాయలు మంజూరు చేసినట్లు వారు తెలిపారు మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, పంచాయతీరాజ్ శాఖ మంత్రికి ధనసరి అనసూయ, ఎమ్మెల్యే మెగా రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి మండల ఇన్చార్జి మంద సత్యశీల రెడ్డి రేవల్లి మండల అధ్యక్షుడు పర్వతాలు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పర్వతాలు టౌన్ అధ్యక్షులు శివన్న ఉపాధ్యక్షులు నాగశేషు వెంకట్ రెడ్డి నాయకులు శేఖర్ బాలయ్య యాదగిరి ప్రవీణ్ కుమార్ శివాలు తదితరులున్నారు.

# పియులో సమస్యల సాధనకై ఎబివిపి పియు ముట్టడి

### - రాష్ట్ర ఎబివిపి కార్యదర్శి ఝాన్సీ ఆధ్వర్యంలో ఆందోళన - డిమాండ్ల సాధనకై విసితో చర్చలు



**మహబూబ్‌నగర్పియు మేజర్‌న్యూస్:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం చలో పాలమూరు యూనివర్సిటీ ముట్టడించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ మాట్లాడుతూ, పాలమూరు విశ్వవిద్యాలయ ఉపకులపతి చాంబర్ ముట్టడించారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులని వెంటనే రెగ్యులరైజ్ చేయాలన్నారు. కోర్సులవారిగా సెమిస్టర్ ఫీజులను తగ్గించాలన్నారు. సరైన వసతులు లేని డిగ్రీ పీజీ కళాశాలల అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గవర్నమెంట్ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో ప్రయోగశాలలు బలోపేతం చేయాలి. బి ఎడ్ కళాశాలలో అక్రమంగా వసూలు చేసే కళాశాల డెవలప్మెంట్ ఫీజులను రద్దు, ప్రతి సంవత్సరం డిగ్రీ మరియు పీజీ కళాశాలలో అడ్మిషన్ పేరుతో వసూలు చేస్తున్న ఫీజులను రద్దు, డిగ్రీ మరియు పీజీ విద్యార్థులకు అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను నిర్వహన, యూనివర్సిటీ పరిధిలో ఉన్న అన్ని కళాశాలల హాస్టల్లో నాణ్యమైన భోజనం, డిగ్రీ మరియు పీజీ విద్యార్థుల సెమిస్టర్ హాల్ టికెట్లలో సబ్జెక్టుతోపాటు పరీక్ష జరిగే తేదీని కూడా ప్రకటించాలన్నారు. రీవాల్యుయేషన్ మరియు రీకౌంటింగ్ సదుపాయంలో సరైన సమయంలో ఫలితాలు విడుదల అయ్యేలా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో ఉన్న హెల్త్ సెంటర్లో సదుపాయాలు మెరుగుపరిచి అంబులెన్స్ సౌకర్యాన్ని 24 గంటలు కల్పించాలి. యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న బోధన బోధనేతర సిబ్బందిని నియమించాలి, మండిపడ్డారు. కార్యక్రమంలో విభాగ్ సంఘటన మంత్రి విభాగ్ నరేంద్ర జిల్లా సంఘటన మంత్రికన్వీనర్ తేజ, జిల్లా కన్వీనర్ సతీష్ కుమార్, జగదీష్,సురేష్,నరేష్, హరీష్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివ, మనీ,మానస, సాయి శివ, అరవిందదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ వనిత, స్ఫూర్తి మాతా రమాబాయి అంబేద్కర్ - ప్రజావాగ్గేయకారుడు రాజారాంప్రకాష్



**వనపర్తి టౌన్, మేజర్‌న్యూస్:** ఆదర్శ వనిత, మహాసాధ్వి త్యాగశీలి మాత రమాబాయి ధైర్య సాహసంతో సహనం కోల్పోకుండా కష్టకాలంలో అంబేద్కర్ మహనీయునికి తాను కష్టపడి పనిచేసిన వచ్చిన డబ్బుతో విదేశాల్లో ఉన్నత విద్యను చదువుకోడానికి అంబేద్కర్‌కు సహాయ సహకారాలు అందించిన మానవతామూర్తి, ఈ తరం మహిళలకు స్ఫూర్తి ప్రధాత రమాబాయిఅంబేద్కర్ అని ప్రజావాగ్గేయకారుడు రాజారాంప్రకాష్ పేర్కొన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో టీజేఏసీ ఆధ్వర్యంలో మహాసాధ్వి రమాబాయి అంబేద్కర్ 126 వ జయంతిని ఘనంగా నిర్వహించి, ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవభారత రాజ్యాంగ నిర్మాత పేదల పెన్నిధి ప్రపంచ మేధావి భారత సమాజ ధర్మాన్ని ప్రశ్నించి నిలదీసి సమధర్మం సమన్యాయం ఏర్పాటు చేసిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అర్ధాంగి రమాబాయి అంబేద్కర్ అని ఆయన తెలిపారు. భారత రాజ్యాంగాన్ని తూ చా తప్పకుండా పాలకులు అమలు చేస్తే రాజ్యాంగాన్ని సవరించాల్సిన అవసరం ఉండదని, పాలకులు తు.చ తప్పకుండా రాజ్యాంగాన్ని అమలు పరచాల్సిన అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కవి పండితుడు బూ రోజు గిరిరాజ చారి కవి శ్రేష్టుడు వ్యాఖ్యాత డాక్టర్ నాయకంటి నరసింహ శర్మ, ఖాదర్ పాషా తెలంగాణా జనసమితి జిల్లా అధ్యక్షుడు, మండ్ల దేవన్న నాయుడు, తెలంగాణ వాల్మీకి సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ కావలి బాలస్వామి నాయుడు, బోయ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర నాయకులు బాలేమియా జిల్లా మైనార్టీ సంఘం నాయకులు. ఇటిక్యాల బండలయ్య విశ్రాంత సైనికుడు, రజక సంఘం నాయకులు గంధం నాగరాజు జిల్లా ఎస్ఎస్సి మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు, డప్పు స్వామి తెలంగాణ జానపద కళాకారుల సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్, గంధం గట్టయ్య ఎమ్మార్పీఎస్ జిల్లా సమన్వయకర్త, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర చారి, నాయకులు సత్యం చారి మాధవచారి, రమేష్ చారి, గంగాధరచారి, శాలివాహన సంఘం జిల్లా నాయకులు వెంకటయ్య ఠాకూర్ నాయక్ జిల్లా గిరిజన సంఘ నాయకుడు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఎగ్జామ్ కిట్టును అందించిన హెల్పింగ్ హాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు రత్నసింహ రెడ్డి






**ధరూర్ మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు విద్యార్థులకు హెల్పింగ్ హాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మా అమ్మమ్మ తాతయ్యలు కీ శే నైబాయి అనంతమ్మ వేమారెడ్డి ఆశయాలకు అనుగుణంగా ఇంతవరకు కొన్ని సామాజిక, వైద్య సేవలు మా కుటుంబం అందించడం జరిగింది. ఇటీవల కాలంలో హెల్పింగ్ హాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ను నెలకొల్పాము. ఇక పై ఈ సంస్థ పేరుతో సేవలు విద్యా రంగంలో కూడా కొనసాగింపు ఉంటుంది. ఈ సంవత్సరం మన జిల్లాలో మార్చి నెలలో జరిగే పబ్లిక్ పరీక్షలు రాయబోవు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రతీ ఒక్కరికి ఒక పరీక్ష ప్యాడ్, హాల్ టికెట్ పౌచ్ మరియు ఒక పెన్ను అందజేస్తున్నాము. కావున మాకు సహకరించిన ప్రధానోపాధ్యాయులకు ధన్యవాదములు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పంపిణి చేయనైనది. ఈ కార్యక్రమం లో హెల్పింగ్ హాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు రత్నసింహ రెడ్డి, కోశాధికారి కృష్ణ వర్ధన్ రెడ్డి,జెనరల్ సెక్రటరీ భీమన్న, ఆర్గనైసింగ్ సెక్రటరీ కొంకతి శ్రీకాంత్, వైస్ ప్రెసిడెంట్ మమత, ఎంఈఓ సురేష్, ధరూర్ జిహెచ్ఎం ప్రతాప్ రెడ్డి పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 9వ, 11వ, తరగతి నవోదయ ప్రవేశ పరీక్ష సజావుగా నిర్వహించాలి

### : ప్రిన్సిపల్ పి. భాస్కర్ కుమార్



**బిజినపల్లి మేజర్ న్యూస్ :** వట్టెం జవహర్ నవోదయ విద్యాలయలో 9 మరియు 11 తరగతుల్లో ప్రవేశానికి గాను శనివారం నిర్వహించబోయే ఎంపిక పరీక్ష ను సజావుగా నిర్వహించాలని నవోదయ ప్రిన్సిపల్ పి భాస్కర్ కుమార్ కోరారు. వట్టెం నవోదయ పాఠశాలలో సెంటర్ సూపరింటెండెంట్ లు మరియు కేంద్ర పరిశీలకుల శిక్షణా కార్యక్రమం బుధవారం నవోదయ విద్యాలయంలొ నిర్వహించారు. ప్రిన్సిపాల్ పి.భాస్కర్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రవేశపరీక్ష ఇన్ చార్జి వి.భాస్కరాచారి ప్రారంభోపన్యాసం ఇస్తూ 9,11 తరగతుల్లో ఖాళీ సీట్ల కొరకు సి బి ఎస్ ఇ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా నుండి హాజరయ్యే విద్యార్థులకు నిర్వహించే ఈ పరీక్షను నాగర్‌కర్నూల్, బిజినేపల్లి, నవోదయ పాఠశాలలలో కలిపి మొత్తం 13 సెంటర్లలో నిర్వహిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ పి.భాస్కర్ కుమార్ ప్రసంగిస్తూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3745 మంది విద్యార్థులు హాజరయ్యే ఈ పరీక్ష నిర్వహణలో భాగమయ్యే అధికారులంతా అత్యంత జాగ్రత్త వహిస్తూ అప్రమత్తంగా ఉండి, పరీక్షను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. పవర్ పాయింట్ సమర్పణ ద్వారా పరీక్ష నిర్వహణ దశలను , జాగ్రత్తలను క్లుప్తంగా వివరించారు.ఇది వరకే దరఖాస్తు చేసుకున్నా వారు ఆన్ లైన్ లో హాల్ టికెట్లను డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ జి.జానకి రాములు మాట్లాడుతూ ప్రతిష్టాత్మక నవోదయ ప్రవేశ పరీక్షలను ప్రతి ఏటా ఎలాంటి అవాంతరాలు లేకుండా విజయ వంతంగా నిర్వహిస్తున్న జిల్లా విద్యా శాఖను అభినందించారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు అవకాశనివ్వకూడదని అన్నారు. అనంతరం వివిధ కేంద్రాల నాన్ కాన్ఫిడేన్సియల్ మెటీరియల్ ను అందించారు.

## సబ్‌స్టేషన్‌లోని ఆపరేటర్‌ను తొలగించాలి కోటకొండ కాంగ్రెస్ నాయకులు



**నారాయణపేట మేజర్ న్యూస్:** కోటకొండ గ్రామంలో సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పని చేస్తున్న కాళిదాసుని తొలగించాలని కోటకొండ కాంగ్రెస్ నాయకులు ఎడ్ల రాజు ప్రభంజన్ రావు రాము తదితరులు ఏఇ సాయి నాథ్‌కు వినతి పత్రం ఇచ్చారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ ఆపరేటర్ రైతులకు సకాలంలో త్రీఫేస్ విద్యుత్ ఇవ్వడం లేదని దాని వల్ల కోటకొండ బండగొండ అభంగాపూర్ తిరుమలాపూర్ రైతులు ఇబ్బందులు గురవుతున్నారని విధుల్లో నుండి తక్షణమే తొలగించాలని వారు డిమాండు చేశారు.

## మానవత్వం చాటుకున్న పద్మశాలీయుల



**అచ్చంపేట అర్బన్ మేజర్ న్యూస్:** అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో గత రెండు రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ వటవర్లపల్లి గ్రామానికి చెందిన రంగ నిర్మల మరణించడం జరిగింది. వారి కుటుంబం ఆర్థికంగా చాలా ఇబ్బంది పరిస్థితిలో ఉన్న విషయం తెలుసుకుని కుటుంబాన్ని ఆదుకోవడానికి అచ్చంపేట పద్మశాలీయుల సహకారంతో 25 వేల రూపాయలు జమ చేయడం జరిగింది. ఈ రోజు వటవర్లపల్లి గ్రామానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ వంతు సహాయంగా 25 వేల రూపాయలను వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది అదే విధంగా భవిష్యత్తులో కూడా తమకు తోచిన సహాయం చేస్తామని హామీ ఇచ్చారు కార్యక్రమంలో పద్మశాలి యువజనసంఘం జిల్లా అధ్యక్షులు కోట కిషోర్, చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి దాసుపత్రి శకుంతల, రంగినేని రవీందర్, కర్నాటి సుధాకర్, కుటుంబ సభ్యులు రంగ రాములు, శివ, కర్నాటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేసిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి టౌన్, మేజర్ న్యూస్ :** పట్టణంలో 10 వ వార్డుకు చెందిన కావలి బాలమ్మ కొన్ని రోజులుగా అనారోగ్య కారణంగా బుధవారం మృతి చెందింది. ఈ విషయాన్ని వార్డు కౌన్సిలర్ జయసుధ మధు గౌడ్ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కి విషయం తెలుపగా మృతురాలు కావలి బాలమ్మ దహన సంస్కారాల నిమిత్తం రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, నివాళు లర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ వనపర్తి నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్ , కాంగ్రెస్ పార్టీ వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ్ చందర్ , కౌన్సిలర్స్ సుమిత్ర యాదగిరి, లక్ష్మి రవి యాదవ్, కాంగ్రెస్ పార్టీ వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ డి వెంకటేష్, రంజిత్, పాల రవి ఉన్నారు. మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని వారు హామీ ఇచ్చారు.

## కొటగట్టు పర్వతంపై బయట పడ్డ పురాతన పెయింటింగ్



**మహబూబ్‌నగర్, మేజర్‌న్యూస్:** మహబూబ్‌నగర్ మండలం చౌదర్‌పల్లి గ్రామంలోని కొటగట్టు పర్వతంపై పురాతన రాతి పెయింటింగ్‌లు, ఆదిమానవుల ఆనవాలు కనుగొన్నట్లు భారతీయ కిసాన్ యూనియన్ జాతీయ కార్యదర్శి యం.ఎ. ఖాదర్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ చరిత్రను కాపాడుకునేందుకు పురావస్తు శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడం జరిగింది అన్నారు. జిల్లా కలెక్టర్ కూడా స్పందించి చౌదర్‌పల్లి గ్రామానికి పరీక్షల నిమిత్తం పురావస్తు సిబ్బందిని పంపించడం జరిగింది అన్నారు. తెలంగాణ ఆర్కలాజికల్ అతి త్వరలో ఈ కొటగట్టు పర్వతంపై మహబూబ్‌నగర్ అడిషనల్ డైరెక్టర్ పరిశీల చేయ్యాలని ఖాదర్ కోరారు.

## 9వ తేదీన పశువుల సంతవేలం పాట



**బిజినపల్లి మేజర్ న్యూస్ :** ఈనెల 9వ తేదీన మండల కేంద్రంలో గల శ్రీ శ్రీ ఆనంద గిరి లక్ష్మీ వెంకటేశ్వర స్వామి జాతర సందర్భంగా 20204. 25 సంవత్సరం నికి గాను పురోతు తై బజార్ పశువుల సంత వేలం పాటను నిర్వహిస్తున్నట్లు గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి మండల తాసిల్దార్ జన్నుంపల్లి శ్రీరాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారంనాడు ఉదయం ఉదయం 12 గంటలకు గ్రామపంచాయతీ ఆవరణంలో ఇట్టి జాతరవేలం పాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కావున జాతర వేలం పాటలో పాల్గొనేవారు తొమ్మిదవ తేదీ నాడు ఉదయం 11 గంటలకు తమ పేర్లను నమోదు చేసుకొని 15 వేల రూపాయలు డిపాజిట్ చెల్లించి రసీదు పొందగలరని ఆయన తెలిపారు. జాతర వేలం పాటలో పాల్గొనే వారు గ్రామపంచాయతీకి ఎలాంటి బకాయిలు ఉండకూడదని ఆయన చెప్పారు.

## నూతన ఎస్సై అభిషేక్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిని కాంగ్రెస్ నాయకులు



**నవాబ్ పేట మేజర్ న్యూస్ :** బుధవారం నవాబ్ పేట పోలీస్ స్టేషన్ ల్లో నూతన సబ్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు తీసుకుంటున్న అభిషేక్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసినా నవాబ్ పేట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నీరెటి రామచంద్రయ్య జిల్లా అధ్యక్షుడు వాసు యాదవ్ నవాబ్ పేట మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫ్రెండ్లీ పోలీసు విధానం పూర్తిగా అమలు చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్సై అభిషేక్ రెడ్డి గారిని మర్యాద పూర్వకంగా కలిసిన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు నవాజ్ రెడ్డి షబ్బీర్ అలీ హాజహర్ అలీ శ్రీహరి రవీందర్ రెడ్డి,బోవళ్ళ రాజశేఖర్,మైనోద్దీన్ రాజు,మంచెందర్ గోపాల్ యాదవ్ నర్సింహులు భాస్కర్ నాయక్ వెంకట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక పారిశుధ్య నివారణ చర్యలను సద్వినియోగం చేసుకోవాలి : ఎంపీడీఓ కథలప్ప



**వీపనగండ్ల, మేజర్ న్యూస్:** ఈ నేల 14వ తేది వరకు కలెక్టర్ ఆదేశాలతో నిర్వహించే ప్రత్యేక పారిశుధ్య నివారణ చర్యలను గ్రామాలలో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కథలప్ప అన్నారు. బుధవారం వీపనగండ్ల గ్రామపంచాయతీ కార్యాలయం లో ప్రత్యేక గ్రామసభను నిర్వహించడం జరిగింది. గ్రామాల ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో రోజువారిగా నిర్వహించే పారిశుధ్య కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వామ్యులు కావాలన్నారు. గ్రామాలలో నెలకొన్న తాగునిటీ. పారిశుధ్య పనులను పంచాయతీ రాజ్. ఆర్డబ్ల్యూస్ శాఖల ద్వారా సత్వర పనులు జరిగేలా చూస్తామన్నారు. ప్రజలు ఇంటిపన్ను. నీళ్ల పన్ను సకాలంలో చెల్లించాలన్నారు. అంతకు ముందు శితిలావ్యవస్థలో ఉన్న వెటర్నరీ ఆసుపత్రి పాత భవనాన్ని ఎంపీడీఓ పరిశీలన చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి. పంచాయతీ కార్యదర్శి నరేష్ గౌడ్. మాజీ వార్డు సభ్యడు నారాయణ రెడ్డి. గ్రామస్తులు. అంగన్వాడీ సిబ్బంది. ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామాలలో పారిశుద్ధ్య వారోత్సవాలు ప్రారంభం



**నవాబ్‌పేట మేజర్ న్యూస్ :** బుధవారం ప్రతి గ్రామంలో పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్ల ఆద్వర్యంలో రోడ్ల మీద పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేసారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పారిశుద్ధ్య వారోత్సవాల ను పురస్కరించుకుని నవాబ్ పేట మండల కేంద్రంలో తహశీల్దార్ మల్కికార్జున రావు పంచాయతీ కార్యదర్శి నరేష్ ఆధ్వర్యంలో గ్రామంలో అక్కడక్కడ నీటి గుంటలు పూడ్చి, ఖాళీ ప్రదేశాలలో పరిశుభ్రంగా ఉండేలా ప్రజలకు సూచించారు.

## నడవలేని స్థితిలో ఉన్న నెమలి పోలీసులకు అప్పగించిన రైతు



**నవాబ్‌పేట మేజర్‌న్యూస్:** బుధవారం రోజు సాయంత్రం సమయంలో కామారం గ్రామ శివారులోని కొత్త లక్ష్మణ్ వ్యవసాయ పొలంలో ఒక నెమలి నడవలేని స్థితిలో ఉండగా పొలం యజమాని లక్ష్మణ్ చూసి దాన్ని నవాబ్పేట్ పోలీస్ స్టేషన్కు తీసుకువచ్చి విషయం తెలుపగా నవాబుపేట %ఎ.జ%. సురేష్ బాబు సంబంధిత ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఎం రమేష్ ను పిలిచి అట్టి మిమ్మల్ని అప్పగించి దాన్ని సంరక్షణ ప్రాంతమైన పిల్లలమరికి తీసుకొని వెళ్ళినాడు.

## అమ్మవారి ఆలయాలు శుద్ధి కార్యక్రమం



**అల్లంపూర్ మేజర్ న్యూస్:** అష్టదశ శక్తి పీఠాలలో ఐదవ శక్తిపీఠమైన శ్రీ జోగులాంబ దేవి అమ్మవారి ఆలయాలను బుధవారం రోజు ఆలయ అర్చకులు మధ్యాహ్నం ఒంటిగంట నుండి ఆలయ శుద్ధి కార్యక్రమాలను నిర్వహించారు ఈనెల 10వ తేదీ నుండి 14వ తేదీ వరకు శ్రీ జోగులాంబ దేవి అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాలను శుద్ధి కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఆలయ అధికారులు ఆలయ చైర్మన్ చిన్నకృష్ణయ్య తెలిపారు. అమ్మవారి ఆలయాల శుద్ధి కార్యక్రమం అనంతరం ఆరున్నర గంటలకు జోగులాంబ అమ్మవారి ఆలయాలు తెరిచి భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ దుర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆరున్నర గంటల అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకోవడం జరిగింది.

## జామా మసీదు కార్యదర్శిని పరామర్శించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**వనపర్తి టౌన్, మేజర్‌న్యూస్:** ప్రమాదంలో గాయ పడి విశ్రాంతి తీసుకుంటున్న మహ మూద్ అబ్జలుద్దిన్‌ను బుధవారం మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి వారి నివాసానికి వెళ్ళి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని పలు సూచనలు చేశారు. త్వరగా కోలుకోవాలని కోరారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి వెంట పి.రమేష్ గౌడ్, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, నీలస్వామి, సయ్యద్ జమేల్, జోహెబ్, చిట్యాల రాము, మంద రాము, పాషా, రాజోలి నిరంజన్, రమేష్ ఉన్నారు.

## ఎస్సై నవీద్‌కు సన్మానం




**కృష్ణ మేజర్ న్యూస్ :** మండలానికి నూతన ఎస్సైగా నియమితులైన ఎస్ఎం నవీద్ కు బుధవారం జిల్లా సర్పంచ్ ల సంఘం మాజీ ఉపాధ్యక్షులు, చేగుంట మాజీ సర్పంచ్ వై శివప్ప మర్యాద పూర్వకంగా కలిసి శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్లంపల్లి మాజీ సర్పంచ్ రామకృష్ణ ధని, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ ఛాలన్లను వెంటనే చెల్లించండి : ఎస్సై నాగ శేఖర రెడ్డి

**బిజినపల్లి మేజర్ న్యూస్ :** బైకులపై, కార్లపై ఉన్న పెండింగ్ ఛాలన్లను వాహనదారులు వెంటనే చెల్లించాలని బిజినేపల్లి ఎస్సై నాగ శేఖర రెడ్డి కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బైకులపై 80%, కార్లపై 60 శాతం డిస్కౌంట్ ప్రకటించిందని ఇట్టి అవకాశాన్ని వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇట్టి అవకాశం ఈనెల 15వ తేదీ వరకు ఉన్నదని తెలియజేశారు. వాహనదారులు తన మొబైల్ ద్వారా గాని, మీసేవ కేంద్రాలలో గాని చెల్లించి సహకరించాలని కోరారు.

## పాలమూరు యూనివర్సిటీకి 200 కోట్లు కేటాయించాలి

### - పియుజేఏసీ ఛైర్మన్ బత్తిని రాము



**మహబూబ్‌నగర్ అర్బన్ మేజర్‌న్యూస్ :** గురువారం నుండి జరిగే బడ్జెట్ సమావేశాలలో 200 కోట్లు రూ.లు కేటాయించాలని దేవరకద్ర నియోజకవర్గం శాసనసభ్యులు జి. మధుసూదన్ రెడ్డి కి జేఏసీ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. బత్తిని రాము మాట్లాడుతూ, యూనివర్సిటీ ఏర్పడినప్పటి నుండి నేటి వరకు బడ్జెట్ కేటాయింపులలో వివక్షత చూపుతున్నారని తెలంగాణ రాష్ట్రం అవతరించిన తర్వాత కూడా 10 కోట్లకు మించి బడ్జెట్ కేటాయించ లేదని కేవలం ఉద్యోగుల జీతభత్యాలు మాత్రమే ఆ నిధులు సరిపోతాయని మిగిలిన కనీస సౌకర్యాలైన అదనపు వసతి గృహాలు,తరగతి గదులు, ల్యాబ్ పరికరాలు ఇతర సౌకర్యాలతో పాటు వనపర్తి పీజీ సెంటర్లలో బాలికలు,బాలురు వసతగృహాలు నిర్మించలేదని అబ్నారు. కొల్లాపూర్ గద్వాల సెంటర్లలో వసతి గృహాలు ప్రారంభించలేదన్నారు. వీటితోపాటు ఇతర మౌలిక సౌకర్యాలు కల్పన కోసం ఈ బడ్జెట్ సమావేశాలలో కాంగ్రెస్ ప్రభుత్వం 200 కోట్ల రూపాయలు కేటాయించే విధంగా దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి శాసనసభలో మాట్లాడాలని విజ్ఞప్తి చేశారని అన్నారు . ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ఈ విషయాన్ని ముఖ్యమంత్రి గారు దృష్టికి తీసుకొని వెళ్ళి యూనివర్సిటీ అభివృద్ధి కోసం అధిక నిధులు మంజూరు చేయిస్తానని అన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆంజనేయులు, ఎంఎస్ఎఫ్ నాయకులు భీముడు, స్వేరో స్టూడెంట్ యూనియన్ నాయకులు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## మండల అభివృద్ధికి ఒక కోటి ముప్పై ఐదు లక్షల నిధులు



**శ్రీరంగాపురం మేజర్ న్యూస్ :** వనపర్తి నియోజకవర్గ పరిధి లోని శ్రీరంగాపూర్ మండలానికి అభివృద్ధి కోసం ఎన్ ఆర్ ఈ జి ఎస్ నిధుల క్రింద 1.35(ఒక కోటి ముప్పై ఐదు లక్షలు) వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యేలితూడి మేఘా రెడ్డి లి మంజూరు చేశారు. ఈరోజు శ్రీరంగాపూర్ మండల నాయకులు నిర్వహించిన లిప్రెస్ నోట్ లో కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ యొక్క ప్రెస్ నోట్ లో మండల నాయకులు తెలియచేస్తూ...అభివృద్ధి అంటే లినాలుగు పెద్దపెద్ద భవనాలు కట్టడం కాదు... గ్రామాలలో... పట్టణాలలో జరిగితే లిదానిని అభివృద్ధి జరిగింది.అని అంటారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు కూడా కాలేదు,... అంతలోనే అభివృద్ధి కొరకై....మేఘారెడ్డి ముందంజలోనడుస్తున్నారు.! కాంగ్రెస్ ప్రభుత్వం అంటే ప్రజలకు ఒక నమ్మకం... కాంగ్రెస్ పార్టీ చెప్పేదే చేస్తుంది... చేసేదే చెప్తుంది. అని ఈరోజు మేఘ రెడ్డి నిరూపించారు. అందులో భాగంగా ఈరోజు వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండలంలో పలు సిసి రోడ్లకు మేఘా రెడ్డి 1 కోటి 35 లక్షలు రూపాయలు మంజూరు చేయడం హర్షించదగ్గ విషయమని..., ఇందుకు శ్రీరంగాపూర్ మండల ప్రజలు మెగా రెడ్డి కి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు బీరం రాజశేఖర్ రెడ్డి , మండల బీసీ సెల్ అధ్యక్షులు పలుస రాజా గౌడు మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు ఈరపాగ కురుమన్న , మండల ఎస్సీ సెల్ ప్రధానకార్యదర్శి లిజమ్మన్నగారి ఆశన్న లిఎస్సీ సెల్ కోశాధికారి లిరంజిత్ కుమార్ లి కాంగ్రెస్ నాయకులు లిచిన్న గోవిందు లి నాయకులు లివిజయకుమార్ రెడ్డి లి మండల యువనాయకులు లిగొల్లవాళ్ళ పరుశరామ్ మరియు మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొని ఈసందర్భంగా ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలియజేసారు.

## త్యాగానికి ప్రతిరూపం రమాబాయిఅంబేద్కర్



**ఐజ మేజర్ న్యూస్ :** జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మున్సిపాలిటీలో అంబేద్కర్ విగ్రహం దగ్గర అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో రమాబాయి 126వ జయంతి జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలోఅఖిలపక్షం కమిటీ నాయకులు దండోరా సీనియర్ నాయకుడు ఆంజనేయులు,పౌరహక్కుల నేత విజయభాస్కర్ రెడ్డి.జిల్లా బెడ బుడుగు జంగం నాయకులు మారెప్ప, కృష్ణయ్య, రాజు, డా : రాజు, బిఆర్ఎస్ నాయకులు అంజి,లెనిన్,మరియు అడ్వకేట్ కార్గిల్, ప్రసాద్, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## కౌకుంట్లలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం



**కౌకుంట్ల మేజర్ న్యూస్:** కౌకుంట్ల మండల కేంద్రంలో బుధవారం ప్రతి గ్రామంలో పారిశుద్ధ వారోత్సవాల్లో భాగంగా ఆయా గ్రామ పంచాయితీ కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో రోడ్లమీద పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కౌకుంట్ల గ్రామ ప్రత్యేక అధికారి వైద్యం భాస్కర్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కౌకుంట్లలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక అధికారి భాస్కర్, కిషన్ రావు, శేఖర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, కలిసి గ్రామంలో అక్కడక్కడ నీటి గుంటలు పూర్చి ,ఖాళీ ప్రదేశాలలో పరిశుభ్రంగా ఉండేలా ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుమన్ మహరాజ్, విద్య కమిటీ చైర్మన్ రాజు, వైద్య అధికారి రఘువరన్, రవీందర్ రెడ్డి, నరేష్, ఆనంద్ రెడ్డి, ఎల్మే స, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## నల్లవల్లి సర్పంచ్ అంజయ్య యాదవ్ కు ఘనసన్మానం



**కోయిలకొండ మేజర్ న్యూస్:** మండలంలో ఉన్న నల్లవల్లి గ్రామపంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్ అంజయ్య యాదవ్ కు పాలకవర్గం సభ్యులకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రజలు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామం లో ఉన్న ప్రజలకు నిరంతరము అందుబాటులో ఉండి ఏ సమస్య వచ్చినా ఆదుకోవడం జరిగిందని తెలియజేశారు. ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో, పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, గ్రామస్తులు కృష్ణారెడ్డి, రాజు, పాల్గొన్నారు.

## బాల్కసుమన్ దిష్టిబొమ్మ దహనం



**తిమ్మాజిపేట మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బల్క సుమన్ సోమవారం చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ఆవరణంలో బల్క సుమన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి గా ఉన్నటువంటి వ్యక్తి పై ఇటువంటి మాటలు మాట్లాడడం సరి కాదని అన్నారు. దళితుల పట్ల మాకు అపారమైన గౌరవం ఉందని దళిత మూసుగు లో నీవు ముఖ్య మంత్రిని అగౌరపరస్తా నంటే సహించేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో దానం బాలరాజు సురేందర్ రెడ్డి లింగం దామోదర్ రెడ్డి మల్లయ్య గౌడ్ ఉస్మాన్ హర్షవర్ధన్ రెడ్డి చెవ్వ మాధవులు వరుణ్ కుమార్ అశోక్ రెడ్డి నాగసాయిలు గిరిజాశంకర్ భాస్కర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు మూఢనమ్మకాలపై అవగాహన



**వనపర్తి టౌన్, మేజర్ న్యూస్ :** ఈ దేశంలో సైన్సు ను అడ్డం పెట్టుకొని కొందరు మూఢనమ్మకాలతో మాయలు, మంత్రాలు, చేతబడులు, అంటూ మోసాలు చేస్తున్నారని, వాటిని నమ్మొద్దంటూ వారు చేసే కొని మిరకిల్స్ ను చేసి చూపిస్తూ విజ్ఞాన దర్శిని ఫౌండర్ రమేష్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. వనపర్తి జిల్లా చిట్యాల గ్రామంలోని జ్యోతిరావు పూలే బాలుర పాఠశాలలో విజ్ఞాన దర్శిని – విజ్ఞానయానం యాత్రలో భాగంగా విద్యార్థులకు మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన సైన్స్, సైంటిస్టులు వారు చేసిన త్యాగాల గురించి అనేక విషయాలను తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, విజ్ఞాన దర్శిని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లి ఆధామ్ రాజ్, మొహ్మద్ అలీ, మహేష్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదంలో పశుగ్రాసం దగ్ధం



**లింగాల,మేజర్ న్యూస్:** మండల పరిధిలోని అంబటిపల్లి గ్రామం లోని ప్రాథమిక పాఠశాల సమీపంలో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో పశు గ్రాసం తో పాటు రైతులకు చెందిన వ్యవసాయ పనిముట్లు దగ్ధం కావడంతో సుమారు ఒక లక్ష రూపాయలు ఆస్తి నష్టం సంభవించింది. బాధిత రైతులు ఎన్న చర్ల పుల్లయ్య, ఎన్న చర్ల వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం పశుగ్రాసం కోసం ఇటీవలనే అప్పుచేసి వరిగడ్డిని, బుడ్డ పొల్లును కొనుగోలు చేసి ఎప్పటి మాదిరిగానే అన్ని రక్షణ చర్యలు చేపడుతూ భద్రపరిచినట్లు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం గడ్డివాము వద్ద మంటలు రేగడంతో పశుగ్రాసం, వ్యవసాయ పనిముట్లు పూర్తిగా అగ్నికి కాలీ బూడిద అయినట్లు తెలిపారు. ఇది ప్రమాదవశాత్తూ జరిగిన సంఘటన కాదని, గుర్తుతెలియని వ్యక్తులు ఈ దుర్ఘటనకు పాల్పడినట్లు అనుమానాలను వ్యక్తం చేశారు. విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని అధికారులకు,పోలీసులకు కోరారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

### - అచ్చంపేట సీ.ఐ రవీందర్.ఎస్.ఐ రాములు



**అచ్చంపేట అర్బన్ మేజర్ న్యూస్:** శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని అచ్చంపేటకు నూత నంగా నియమితులైన సీ.ఐ రవీందర్.ఎస్.ఐ రాములు అన్నారు బుదవారం అచ్చంపేట పట్టణంలోని పోలీస్ స్టేషన్ లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని అమలు చేస్తామన్నారు ప్రజలు దైర్యంగా స్టేషన్ కి వచ్చి సమస్యలు తెలపాలని సూచించారు అదే విధంగా నూతనంగా వచ్చిన సీఐ. ఎస్ఐ లను మర్యాదపూర్వకంగా కలుసుకొని సన్మానించడం జరిగింది కార్యక్రమంలో కాశన్న యాదవ్. లాలూ యాదవ్. తిరుపతి యాదవ్. మహేష్ యాదవ్. శ్రీనివాస్ యాదవ్. అంజి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రెండో రోజు వైభవంగా ఈదమ్మ జాతర ఉత్సవాలు

**పానగల్, మేజర్‌న్యూస్:** పానగల్ మండల కేంద్రంలో ఈదమ్మ జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం రెండో రోజు జాతర ఉత్సవాలలో భాగంగా మండల కేంద్రానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో ఈదమ్మ దేవతకు బోనాల రూపంలో నైవేద్యాన్ని సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు, ప్రతి ఏటా అనవయితీగా రైతులు ఫలహారం బండ్లను ఈదమ్మ ఆలయం చుట్టూ తిప్పి మొక్కలను తీర్చుకున్నారు, కార్యక్రమంలో స్థానిక అధికారులు ప్రజాప్రతినిధులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ నూతన జిల్లా గర్ల్స్ కమిటీ ఎన్నిక




**మహబూబ్‌నగర్ అర్బన్ మేజర్‌న్యూస్:** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ నూతన గర్ల్స్ కన్వెన్షన్ ను బుదవఎం నిర్వహిం చామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ అన్నారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ జాతీయ నాయకురాలు మమత హాజరయ్యారు. సిఐటియు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జాతీయ నాయకురాలు మమత మాట్లాడుతూ అమ్మాయిలకు చట్టాలు పకడ్బంద్‌గా అమలు చేయాలని వారు కోరారు. మహిళా కళాశాల హాస్టల్‌లో ఉండే విద్యార్థులకు ప్రభుత్వం మెడికల్ కిడ్స్ పంపిణీ చేయాలని , అదేవిధంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అన్నారు. ఏ అమ్మాయికి ఏ సమస్య వచ్చిన ప్రభుత్వం వెంటనే స్పందించాలని అన్నారు. తక్షణమే ప్రభుత్వ మహిళ జూనియర్ కళాశాలలో టైలర్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. లేనిచో చలో కలెక్టరేట్ ముట్టడిస్తామని వారు పిలుపునిచ్చారు. హాస్టల్ విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నూతన గర్ల్స్ కమిటీ ఎన్నిక 17 మందితో జిల్లా కమిటీ 6 మందితో ఆఫీస్ బేరర్స్ ఎన్నుకున్నట్లు తెలిపారు. జాతీయ నాయకురాలు మమత అన్నారు.జిల్లా కన్వీనర్ గా రాధిక కో కన్వీనర్ గా రమాదేవి, ప్రసన్న, శిరీష, సరిత, రాధా, ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జిల్లా అధ్యక్షుడు భరత్, నాయకుడు ఈశ్వర్, నందు, రాము, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ



**మక్తల్, మేజర్‌న్యూస్:** రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన మక్తల్ మహాత్మా జ్యోతి రావు పూలె బాలికల పాఠశాల విద్యార్థులకు ఈనాడు లక్ష్య అథ్లెటిక్స్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందజేయడం జరిగిందని కోచ్ జగదీశ్ తెలిపారు, ముఖ్య అతిథిగా నారాయణపేట జిల్లా క్రిడలా అధికారి వెంకటేష్ శెట్టి పాల్గొని క్రీడాకారులకు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఇప్పుడు ఉన్న సమాజంలో అమ్మాయిలు అన్ని రంగాలలో రానిస్తున్నారు, మీరందరు కూడా ప్రతి ఒక్కరు మీకు నచ్చిన రంగంలో ముందుకు వెళ్లాలని నిరంతరం మీరు ఈవెనింగ్ రౌండ్ లో అథ్లెటిక్స్ లో శిక్షణ తీసుకుంటున్న అందరూ కూడా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని మీ పాఠశాలకు, పట్టణానికి, జిల్లాకు, రాష్టానికి, దేశానికి పేరు తీసుకురావాలి తెలియజేశారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుగుణ మాట్లాడుతూ మా విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ అందజేసిన కోచ్ జగదీష్ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుగుణ, లిటిల్ ఏంజిల్ ప్రిన్సిపాల్ జగదీశ్వర్, రమణమ్మ, కోచ్ జగదీశ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## భక్తులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించిన డాక్టర్ శ్రీనివాసులు



**వంగూర్ మేజర్ న్యూస్ :** శ్రీశైలంలోని పద్మశాలి సత్రంలో చారగొండ మండల కేంద్రానికి చెందిన0 డాక్టర్ చిలువేరు శ్రీనివాసులు భక్తులకు బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని సంస్థ అధ్యక్షులు వర్కాల సూర్యనారాయణ ప్రారంభించారు. 13 సంవత్సరాలు గా శ్రీశైల దేవస్థానానికి విచ్చేసిన భక్తులకు తన తల్లిదండ్రులు చిలువేరు మల్లప్ప మల్లమ్మ పేరున వైద్య శిబిరాన్ని నిర్వహిస్తూ ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నట్లు డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. దీంతోపాటు హైదరాబాద్ కు చెందిన ఏలే యాదగిరి తన సతీమణి పద్మ తో కలిసి తన తల్లిదండ్రులైన ఏలే వీరయ్య రామ లక్ష్మి పేరున సత్రంలోని సభ్యులకు ఉచితంగా నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థసభ్యులు బాలకిష్టయ్య మేనేజర్ వేల్పుల కృష్ణ గోవిందరాజు హనుమంతరావు గిరిధర్ పాల్గొన్నారు.

## పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 12 ప్రారంభం

**ధరూర్ మేజర్ న్యూస్:** మండల పరిధిలోని పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు స్వస్తిశ్రీ శాలివాహన శక 1945 శోభకృత్ నామ సం?ర మాఘ శుద్ధ తదియలు మొదలు శుద్ధ దశమి వరకు శ్రీ అంజనేయస్వామి వారి బ్రహ్మోత్సవములు ఈ నెల 12నుండి 19 వరకు జరుగుతాయని దేవాలయ వ్యవస్థాపక వంశీయులు గిరి రావు, ఈ ఒ కవిత తెలిపారు. 12న అంకురార్పణ ధ్వజారోహణం, 13న ఉపనయనం, తెప్పోత్సవం, పల్లకి సేవ, ప్రబొత్సవం, 14న రాత్రి 10 గంటలకు రథోత్సవం, 15 ప్రబోత్సవం, 16న అవబ్రుత స్నానం, 17న భీష్మాష్టమి, 18న మధ్యాహ్నవమి, 19న పల్లకి సేవ స్వస్తి వాచకం ఉంటాయని తెలిపారు. 12న ధ్వజారోహణ సందర్భంగా నూతన ధ్వజస్తంభం ప్రతిష్టించినందుల స్వామి వారు కులదేవతగా ఉన్న భక్తులు ఇంటి ఆడపడుచులకు నూతన వస్త్రములు పెట్టుకోవాలని తెలిపారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా జడ్పీ చైర్పర్సన్ సరిత, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరుకానున్నారు.

## మంత్రిని కలిసిన ఆలయ పాలకమండలి

**అల్లంపూర్ మేజర్ న్యూస్:** ఈనెల 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు శ్రీ జోగులాంబ దేవి అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం రోజు బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానం ఆలయ పాలకమండలి చైర్మన్ చిన్న కృష్ణయ్య ఆలయ అధికారి రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖను కలిశారు. అమ్మవారి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠంగా వీరాజిల్లుతున్న అమ్మవారి ఉత్సవాలకు రావాలని పాలకమండలి సభ్యులు అధికారులు హైద రాబాద్లోని ఆమె నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అంతకంటే ముందు ఆలయ ప్రధాన అర్చకుడు దిండిగల్ ఆనంద్ శర్మ పాలకమండలి సభ్యులతో కలిసి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖను ముందుగా సెలవుతో సన్మానం చేసి ఆలయ మర్యాదలతో ఆమెను సత్కరించారు. మంత్రి మాట్లాడుతూ అమ్మవారి బ్రహ్మోత్సవాలకు తప్పనిసరిగా హాజరవుతానని పాలకమండలి సభ్యులు అధికారులకు మంత్రి తెలిపారు. పాలకమండలి చైర్మన్ చిన్న కృష్ణయ్య పాలకమండలి సభ్యులు వెంకటనారాయణ రెడ్డి ఆలయ ప్రధాన అర్చకుడు దిండిగలానా శర్మ పాల్గొన్నారు.

## రైస్ మిల్లు యజమాని పరమేశ్వర రెడ్డి అరెస్టు .. రిమాండ్‌కు తరలింపు

### - ఐదు మిల్లులపై మూడు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు - డీఎస్పీ ఆనంద్ రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, మేజర్ న్యూస్ :** ప్రభుత్వం అప్పగించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి సకాలంలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఇవ్వాల్సిన రైస్ మిల్లర్లు వనపర్తి జిల్లాలో కొందరు మొండికెస్తున్నారు. ఇదే వ్యవహారంలో వనపర్తి జిల్లా పానుగల్ మండలం మాందాపురం గ్రామానికి చెందిన రైస్ మిల్ యజమాని పరమేశ్వర రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన వరి ధాన్యాన్ని బయటి మార్కెట్లకు అక్రమంగా విక్రయించి ఎఫ్‌సీఐ , రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పోరేషన్‌కు సకాలంలో బియ్యం ఇవ్వలేదనే ఆరోపణలపై ఇటీవల అధికారులు పరమేశ్వర రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులకు సంబంధించిన ఐదు రైస్ మిల్లుల్లో వరి ధాన్యం నిల్వలపై క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. అధికారుల విచారణలో ఐదు మిల్లుల్లో కలిపి లక్షల కొద్ది వరి ధాన్యం బస్తాలు తక్కువగా ఉండడంపై సివిల్ సప్లయ్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సివిల్ సప్లయ్ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు పరమేశ్వర రెడ్డితో పాటు ఆయన కుమారుడు మధు కుమార్ రెడ్డి, కోడలు అనూష పై కేసు నమోదు చేసి, వారి కోసం గాలించగా బుధవారం తెల్లవారు జామున పరమేశ్వర రెడ్డిని అరెస్టు చేసి, కోర్టులో ప్రవేశ పెట్టగా న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించడం జరిగిందని డీఎస్పీ ఆనంద్ రెడ్డి తెలిపారు. పానుగల్ మండలం మాందాపూర్ గ్రామంలో ఇషాన్ అగ్రో టెక్, మీనాక్షి ఫుడ్ ప్రోడక్ట్ , పానుగల్ మండల కేంద్రంలో పరమేశ్వర రైస్ మిల్లు , వనపర్తి పట్టణంలో కేధార్‌నాథ్ ట్రేడర్స్ , కొత్తకోట మండలం మిరాసిపల్లి గ్రామంలో ఇషాన్ ట్రేడర్స్ ల పేరుతో ఐదు రైస్ మిల్లులను నడిపినట్లు అధికారులు తెలిపారు. సివిల్ సప్లయ్ అధికారుల ఫిర్యాదు మేరకు పానుగల్ పోలీస్ స్టేషన్, వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్, కొత్తకోట పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేసినట్లు తెలిసింది.

## ప్రధానమంత్రి విశ్వకర్మయోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### - జిల్లా కలెక్టర్ పి ఉదయ్ కుమార్

**నాగర్‌కర్నూల్, మేజర్ న్యూస్:** చేతివృత్తులు, కులవృత్తుల వారికి ఆర్థిక భద్రత కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ పి ఉదయ్ కుమార్ సూచించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ ఉదయ్ కుమార్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 సంప్రదాయ వృత్తులకు చెందిన కులవృత్తులు, కళాకారులు మరియు హస్తకళాకారులు విశ్వకర్మ, దోభీ, నాయిని బ్రాహ్మణ, కుమ్మరి, శిల్పులు, స్వర్ణకారులు, వడ్డెర, మేర, మేదరి, ఉప్పరి, మొచి, మొదలకు చేతివృత్తులవారు మరియు కళాకారులకు పరికరాల కోసం సహాకారన్ని అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. నాగర్ కర్నూలు జిల్లాలో ఈ వృత్తులపై జీవిస్తున్న వారికి పియం విశ్వకర్మ యోజన పథకం ద్వారా అర్హులైన వారికి సర్టిఫికెట్, ఐడి కార్డు తో పాటు పారిశ్రామిక పనిముట్ల( ట్రైనింగ్ టూల్ కిట్) కొనుగోలు కొరకు 15వేల ఆర్థిక సహాయాన్ని అందిస్తారని తెలిపారు. 5 శాతం వడ్డీకే 3 లక్షల ఎంటర్ ప్రైజెస్ డెవలప్ మెంట్ లోన్ ను రెండు విడతలుగా అందజేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. డిజిటల్ లావాదేవీలపై ప్రతినెల 100 ట్రాన్సెక్షన్ కు ఒక రూపాయి చొప్పున ఇన్ సెంట్ లభిస్తుందని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో ఏర్పాటు కానున్న కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా ఆధార్, రేషన్ కార్డు, పాన్ కార్డు, మొబైల్ నెంబర్, బ్యాంకు వివరాలను సమర్పించి దరఖాస్తులు చేసుకోవచ్చని, దీనికి 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు అర్హులని పేర్కొన్నారు. పిఎం విశ్వకర్మ యోజన పథకానికి సంబంధించిన అవగాహ కోసం జిల్లా కేంద్రంలో ఈనెల 19వ తేదీన వివిధ కులాల చేతి కుల వృత్తుదారులకు అవగాహన కల్పించేందుకు అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఎమ్మెస్ యంఈ శ్రీనివాసరావు, జియం ఇండస్ట్రీస్ రవి కిరణ్, జెడ్పిసిఓ ఉష జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీధర్ జి, లీడ్ బ్యాంక్ మేనేజర్ కౌశల్ కిషోర్ పాండే, కామన్ సర్వీస్ సెంటర్ మేనేజర్ శివ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమందడి మండలంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 3.45 కోట్ల నిధులు మంజూరు

### - ప్రతిపక్షాల విమర్శలకు ధీటుగా వనపర్తిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం - ఎంపీపీ తమ్మలి రఘు ప్రసాద్



**పెద్దమందడి , మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని అన్ని గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణానికి జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.3.45 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎంపీపీ తమ్మలి రఘు ప్రసాద్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీపీ చాంబర్‌లో విలేకర్ల సమావేశం లో రఘు ప్రసాద్ తో పాటు తాజా మాజీ సర్పంచులు పాల్గొన్నారు. మండలంలో సీసీ రోడ్ల అవసరాన్ని స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే ఆయన రూ.2 కోట్ల 50 లక్షల నిధులు మంజూరు చేశారని అదనంగా మరో రూ.85 లక్షలు ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే హామీ ఇచ్చారన్నారు. అలాగే రాష్ట్రంలో పేద ప్రజల అభివృద్దే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తు వస్తుందని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే రెండు గ్యారెంటీలను అమలు చేయగా , ఫిబ్రవరి నెలలో మరో రెండు గ్యారెంటీలను అమలుకు శ్రీకారం చుట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్షాల విమర్శలకు ధీటుగా అభివృద్దే ధ్యేయంగా పని చేసి ఎమ్మెల్యే మేఘారెడ్డి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్తారని అన్నారు. విలేకర్ల సమావేశంలో మాజీ జడ్పీటీసీ వెంకటస్వామి, మాజీ సర్పంచులు కుడుకుంట్ల వెంకటస్వామి, గట్లఖానాపురం ఎంపీటీసీ దామోదర్, సిద్దయ్య, ముందరితాండ మాజీ సర్పంచ్ జయంతి పెద్దమందడి మాజీ సర్పంచ్ వాకిటి శ్రీనివాసులు , మండల కాంగ్రెస్ నాయకులు , మాజీ ఎంపీటీసీ రాంచంద్రయ్య గౌడ్, కొత్తకాపు రామకృష్ణారెడ్డి, విట్ట వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ బుచ్చన్న, సింగిల్‌విండో డైరెక్టర్ వాకిటి వరేష్, ట్రైలర్ రవి తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటా

### - మొదంపల్లి గ్రామంలో కార్యకర్తలతో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి చిట్ చాట్



**బాలానగర్ మేజర్ న్యూస్ :** పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి తెలిపారు బుధవారం బాలానగర్ మండల పరిధిలోని మొదంపల్లి గ్రామములో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో ముఖాముఖి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత మొదటిసారిగా మోదంపల్లి గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే పార్టీ కార్యకర్తలు ప్రజలతో ముచ్చటించారు. గ్రామ సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన తీరును, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులను కార్యకర్తలకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను

సంచలన దినపత్రికగా పేరొందిన నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
లో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన విద్యావంతులకు, విలేకరులకు

వనపర్తి జిల్లా : కొత్తకోట, మదనాపురం, ఆత్మకూర్, అమరచింత, పెబ్బేర్ రూరల్, ఖిల్లాఘణపురం, ఏదుల

ఏరియాల్లో అవకాశం కల్పిస్తోంది.

సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.

ఆసక్తి కలిగిన వారు సంప్రదించాల్సిన నెంబరు
9948271112,
7702532903